**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

A.P VISION TV

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్: పేరపోగు వెంకటేశ్వర్లు | గురువారం 06-03-2025 | సంపుటి : 11 | సంచిక : 53 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# ఎపిని ఆర్థికంగా గట్టెక్కించండి

### ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు వినతి
### హోంమంత్రి అమిత్ షా, గడ్కరీలతో భేటీ



న్యూఢిల్లీ,మార్చి5: ఎపిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఇతోధికంగా నిధులు అందించాలని కేంద్రానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విన్నవించారు. ఈ మేరకు ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌తో చర్చించారు. దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు.మధ్యాహ్నం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి.. అరకు కాఫీతో పాటు ఓ జ్ఞాపికను అందజేశారు. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్.. అమిత్ షాతో సమావేశమై వివిధ అంశాలపై దాదాపు గంట పాటు చర్చించారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్‌ను కలిశారు. చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా నిర్మలా సీతారామన్‌ను కలిసి.. రాష్ట్ర బ్జడెట్ ప్రతులను ఆమెకు అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఏపీకి ఆర్థికంగా మరిన్ని వెసులుబాట్లు కల్పించే అంశంపై నిర్మలా సీతారామన్‌తో సీఎం, ఆర్థిక మంత్రి చర్చలు జరిపారు. ఇటీవలే ఏపీలో ప్రవేశపెట్టిన బ్జడెట్ వివరాలను ఆమెకు వివరించారు. క్యాపిటల్ ఎక్స్ పెడించర్ నిధుల కోసం ప్రత్యేకంగా వీజీఎఫ్ స్కీం ప్రవేశపెట్టడంపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలో తొలిసారిగా ఈ తరహా విధానం ఉందన్న చర్చల్లో భాగంగా నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. వీజీఎఫ్ స్కీంలో భాగంగా కార్పస్ ఫండ్ నిమిత్తం రూ. 2 వేల కోట్లు కేటాయించామని సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల వివరించారు. వివిధ మార్గాల్లో ఇప్పటి వరకు అందించిన సాయంపై నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇక పైనా ఇదే తరహా సహకారం ఉండాలని.. వీలైనన్ని కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తమకు నిధులు కూడా అదే స్థాయిలో వచ్చేలా చూడాలని కోరారు. తరవాత మరోమంత్రి నితిన్ గడ్కరీతోనూ భేటీ అయ్యారు. వివిధ రోడ్లకు సంబంధించి సిఎం చర్చించారు.



# సభలో బలం మేరకే ప్రతిపక్ష హోదా

### హోదా కోసం జగన్ హైకోర్టుకూ వెళ్లారు
### బెదిరింపు తరహాలో తనకూ లేఖ రాశారు
### హోదా అన్నది స్టే రాదని స్పష్టం చేసిన స్పీకర్



అమరావతి,మార్చి5: ప్రతిపక్ష హోదాపై నిరాధార ఆరోపణలతో వైకాపా ఎమ్మెల్యే జగన్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం సభ ప్రారంభం కాగానే ఆయన మాట్లాడారు. 'ప్రతిపక్ష హోదాపై వైకాపా ఎమ్మెల్యే జగన్ హైకోర్టుకు కూడా వెళ్లారు. న్యాయ పక్రియ కొలిక్కి వచ్చేవరకు వేచి చూద్దామకున్నా. ఇటీవల జగన్, వైకాపా సభ్యులు చేసిన వ్యాఖ్యలు నా దృష్టికి వచ్చాయి. ఎంతటివారిపైనైనా అసత్యాలు ప్రచారం చేసే ధోరణితో జగన్ వ్యవహరిస్తున్నారు. వారు చేస్తున్న ఆరోపణలు గందరగోళానికి దారి తీస్తున్నాయి. స్పీకర్‌కు దురుద్దేశాలు ఆపాదించడం సభా నియమాల ఉల్లంఘన కిందికి వస్తాయి. దేవుడు తిరస్కరించిన వరాన్ని పూజారి నుంచి ఆశించడం తప్పని అయ్యన్న వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే సరైన సంఖ్యా బలం ఉండాలని చట్టం చెబుతోంది. 175 మంది సభ్యులున్న శాసనసభలో కనీసం 18 మంది సభ్యుల బలం ఉంటే తప్ప ప్రతిపక్ష హోదా రాదు. అంటే కనీసం 10 శాతం సభ్యులు ఉంటేనే ప్రతిపక్ష హోదా వస్తుందనే నిబంధనను గతంలో జగనే సభలో ప్రస్తావించారు. ఇవన్నీ తెలిసీ జగన్ చేసిన ప్రేలాపనలను సభాపతి హోదాలో క్షమించి వదిలేస్తున్నా. అభియోగాలు, ప్రేలాపనలు, బెదిరింపులతో జగన్ నాకు గత ఏడాది జూన్ 24న లేఖ రాశారు. ప్రతిపక్ష హోదా కావాలంటూ హైకోర్టును కూడా ఆశ్రయించారు. తనకు ప్రతిపక్ష హోదా ఇచ్చేలా సభను ఆదేశించాలని విచారణకు తీసుకోవాలా.. వద్దా అనే దశలోనే ఉంది. అయినా ప్రతి పక్ష హోదాపై ఆయన అసత్యాలు ప్రచారం చేస్తూనే ఉన్నారు. తప్పుడు ప్రచారానికి తెరదించేందుకు రూలింగ్ ఇవ్వాలని నిర్ణయించా. సభకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యేలు.. ప్రజలు తమను ఎందుకు గెలిపించారో ఆలోచించాలి. సభకు రాకుంటే తమ నియోజకవర్గ ప్రజల సమస్యలు ఎవరు లేవనెత్తుతారు?

# తల్లికి వందనానికి త్వరలో మార్గదర్శకాలు: లోకేశ్



అమరావతి,మార్చి5(ఆర్ఎన్ఎ): 'తల్లికి వందనం' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే ఇస్తాం. బడ్జెట్‌లో రూ.9407 కోట్లు ఈ పథకానికి కేటాయించాం. గత ప్రభుత్వంలో దీనికి ఏడాదికి రూ.5,540 కోట్లు కేటాయించారు, గతంతో పోలిస్తే ఇది 50శాతం అధికం. ఎన్నికలకు ముందు సూపర్-6 అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'తల్లికి వందనం' పథకాన్ని చంద్రబాబు ప్రకటించారు. మే నెలలో తప్పనిసరిగా ఇంటిలో ఎంతమంది చదువుకునే బిడ్డలుంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం' అని లోకేశ్ తెలిపారు.

# కేదార్‌నాథ్ యాత్రికులకు కేంద్రం శుభవార్త

న్యూఢిల్లీ: దేవభూమిగా భాసిల్లుతున్న ఉత్తరాఖండ్‌లో వెలిసిన పుణ్యక్షేత్రాల్లో ఒకటి- కేదార్‌నాథ్. జ్యోతిర్లింగాల్లో ఒకటైన కేదారనాథుడిని ఏటా లక్షలాదిమంది దర్శించుకుంటుంటారు. ఈ క్రమంలో ఎన్నో ప్రయాసలను ఎదుర్కొంటుంటారు. ఈ యాత్రను సులభతరం చేసింది కేంద్ర ప్రభుత్వం. సోన్‌ప్రయాగ నుండి కేదార్‌నాథ్ వరకు రోప్ వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఏర్పాటైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై ఆమోదం తెలిపింది. సోన్‌ప్రయాగ్ నుండి కేదార్‌నాథ్ వరకు 12.9 కిలో మీటర్ల పొడవున ఈ రోప్‌వే ప్రాజెక్టును నిర్మించడానికి అంగీకారం తెలియజేసింది. ఈ ప్రాజెక్ట్- డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ పద్ధతి నిర్మితమౌతుంది. నిర్మాణ వ్యయం మొత్తం 4,081.28 కోట్ల రూపాయలు. ఈ రోప్‌వేను ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో రూపుదిద్దుకోనుంది. దీనికి అవసరమైన అన్ని రకాల ప్రణాళికలను వేగవంతం చేయనుంది కేంద్ర ప్రభుత్వం. అత్యంత అధునాతన ట్రై-కేబుల్ డిటాచబుల్ గొండోలా (3ఎస్) సాంకేతికత ఆధారంగా నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. గంటకు 1,800 మంది చొప్పున రోజుకు 18,000 మంది భక్తులను మోసుకెళ్లేలా ట్రై-కేబుల్ డిటాచబుల్ గొండోలాను డిజైన్ చేస్తారు. పర్యావరణానికి అనుకూలంగా, సౌకర్యవంతంగా, వేగవంతంగా కనెక్టివిటీని అందిస్తుందని కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. సోన్‌ప్రయాగ నుంచి కేదార్‌నాథ్ వరకు ప్రస్తుతం ఉన్న సమయాన్ని దాదాపు 8 నుండి 9 గంటల వరకు తగ్గించగలుగుతుంది. గౌరీ కుండ్ నుండి 16 కిలోమీటర్ల ఎత్తున ఉంటుంది కేదార్‌నాథ్ ఆలయం. ట్రెక్కింగ్ చేయడం చాలా కష్టం. ప్రస్తుతం కాలినడకన లేదా గుర్రాలు, పల్లకీ, హెలికాప్టర్ ద్వారా భక్తులు రాకపోకలను సాగిస్తోన్నారు. దీన్ని సులభతరం చేయడానికి రోప్ వే ప్రాజెక్ట్‌కు ఆమోదం తెలిపింది.ఉత్తరాఖండ్ రుద్రప్రయాగ జిల్లాలో 3,583 మీటర్ల ఎత్తులో ఉంటుంది కేదార్‌నాథ్ ఆలయం. అత్యంత శక్తిమంతమైన ద్వాదశ పవిత్ర జ్యోతిర్లింగాలలో ఇదీ ఒకటి. ఈ ఆలయం అక్షయ తృతీయ



(ఏప్రిల్-మే) నుండి దీపావళి (అక్టోబర్-నవంబర్) వరకు సంవత్సరంలో దాదాపు 6 నుండి 7 నెలల పాటు యాత్రికుల కోసం తెరిచి ఉంటుంది. ఈ సీజన్‌లో ఏటా దాదాపు 20 లక్షల మంది యాత్రికులు సందర్శిస్తారు.

# సిఐడి నోటీసులపై స్టే ఇవ్వండి


### హైకోర్టులో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పిటిషన్

అమరావతి,మార్చి5):ఏపీ హైకోర్టులో సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పిటిషన్ దాఖలు చేశారు. తనకు ఇచ్చిన సీఐడీ నోటీసులపై స్టే ఇవ్వాలని పిటిషన్ లో కోరాడు రామ్ గోపాల్ వర్మ. కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' సినిమాపై ఒంగోలు, అనకాపల్లి, మంగళగిరిలో సీఐడీకి ఫిర్యాదులు అందాయి. దానికి తోడు విద్వేషాలు రెచ్చగొట్టేలా సినిమాను చిత్రీకరించారని వర్మపై గతంలోనే ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలని వర్మకి సీఐడీ నోటీసులు జారీ చేసింది. దీంతో సీఐడీ నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు ఆర్జీవీ. రేపు విచారణకు వచ్చే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఇప్పటికే వ్యూహం సినిమాకు సంబంధించి ఇప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కించపరిచేలా సినిమా తీసాడని ఆర్జీవీపై కేసు నమోదు అవగా హాజరయ్యాడు ఆర్జీవీ. ఇప్పుడు సీఐడీ అధికారుల మినహాయింపు కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు రామ్ గోపాల్ వర్మ.

# సిఎం చంద్రబాబుతో గాదె శ్రీనివాసులు నాయుడు భేటీ

### ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషికి హామీ

అమరావతి,మార్చి5: టీచర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పాలసీల రూపకల్పన విషయంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాకే నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన బోధనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉపాధ్యాయ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో బుధవారం ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు కలిశారు. గాదె శ్రీనివాసులు నాయుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. కూటమి



ప్రభుత్వానికి తన మద్దతు గాదె శ్రీనివాసులు నాయుడు ప్రకటించారని చెప్పారు. ప్రభుత్వానికి -ఉపాధ్యాయులకు మధ్య శ్రీనివాసులు నాయుడు వారధిగా పనిచేస్తారని సీఎం చంద్రబాబుకు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సహకారంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తెలిపారు.

# ట్రంప్‌ను మించిన సెక్యూరిటీతో ధ్యాన కేంద్రానికి కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల బహిరంగంగా ఎక్కువగా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన పంజాబ్ రాష్ట్రం హోషియార్‌పూర్‌లోని "విపశ్యన" ధ్యాన్య కేంద్రంలో బుధవారం నుంచి పదిరోజులు పాటు పాల్గొంటున్నారు. తాజాగా ఆయన 'విపశ్యన' ట్రిప్ సైతం రాజకీయ విమర్శలకు దారితీసింది. చుట్టూ కంచుకోట లాంటి భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య ఆయన ధ్యాన కేంద్రానికి వెళ్లడం ఈ విమర్శలకు కారణమైంది. సామాన్యుడనని చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చిన కేజ్రీవాల్ అసలు రూపం మరోసారి బయటపడిందంటూ దీనిపై విపక్షాలు మండిపడుతున్నాయి.కేజ్రీవాల్ ట్రిప్ కోసం ఏర్పాటు చేసిన భారీ భద్రతపై ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చురకలు వేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ భద్రతతో కేజ్రీవాల్ భద్రతను పోల్చారు. "వీఐపీ సంస్కృతి అంటూ యావత్ ప్రపంచాన్ని ఆడిపోసుకున్న కేజ్రీవాల్ ఈరోజు డొనాల్డ్ ట్రంప్‌కు మించి సెక్యూరిటీ కవర్‌తో తిరిగుతున్నారు" అంటూ ఆమె ట్వీట్ చేశారు.కేజ్రీవాల్ 'వీఐపీ మహరాజా'లా తిరుగుతున్నారంటూ బీజేపీ నేత, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సర్సా వ్యాఖ్యానించారు. ఒకప్పుడు వేగనార్‌లో తిరుగుతూ సాధారణ వ్యక్తిలా నటించిన కేజ్రీవాల్ ఇప్పుడు విపస్యనా ధ్యానకేంద్రానికి భారీ మందీమార్బలంతో వెళ్లడాన్ని ప్రశ్నించారు. ఆయన కాన్వాయ్‌లో బుల్లెట్‌ప్రూఫ్ ల్యాండ్ క్రూయెజర్, 100 మందికి పైగా పంజాబ్ పోలీసు కమెండోలు, జామర్లు, అంబులెన్సులు ఉన్నాయి. ఇదంతా విపాస్యనా కేంద్రానికి ధ్యానం కోసం వెళ్లేందుకు వీఐపీ మహరాజా ట్రీట్‌మెంట్. ఆప్ అసలు రూపం ఏమిటో బయటపడింది.

# సంపాదకీయం

గురువారం 06-03-2025

## ఆగని మల్టీ మార్కెటింగ్ మోసాలు

పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ! తక్కువ టైమ్‌లో.. ఎక్కువ ఆదాయం! ఇంట్లో నుంచే.. బీరువాల నిండా సంపాదించండి! ఇలాంటి ప్రకటనలతో.. ముందూ వెనకా ఆలోచించకుండా.. అత్యాశకు పోయి ఎంతో మంది భారీగా నష్టపోతున్నారు. నెట్‌వర్కింగ్ పేరుతో కొందరు కేటుగాళ్లు నట్టేట ముంచేస్తున్నారు. బిజినెస్, ప్రొడక్ట్, మార్కెటింగ్ అంటూ తెలివిగా మోసం చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో.. ఈ తరహా మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు పెరిగిపోయాయ్. ఇప్పటికైనా మేలుకోని.. తేరుకోకపోతే.. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు. తక్కువ టైంలో ఎక్కువ లాభాలు ఆర్జించొచ్చు. ఎంతమంది ఏజెంట్లని చేర్పిస్తే అన్ని రివార్డులు, పాయింట్లు, రిఫర్ చేస్తే బోనస్‌లు వస్తాయని ఆశ చూపే దందాలు ఈ మధ్యకాలంలో ఎక్కువైపోయాయ్. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ఈ దేశంలో మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు మళ్లీ పెరుగుతున్నాయ్. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, హెర్బల్ ప్రొడక్ట్స్, హెల్త్ కేర్ ఉత్పత్తులు, క్రిప్టో కరెన్సీ, నిత్యవసర వస్తువులు, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్, ఎలక్ట్రిక్ బైకుల అమ్మకాల పేరిట అడ్డంగా మోసం చేస్తున్నారు. పిరమిడ్ మోడల్ తరహా మోసాలు చేసే కేటుగాళ్లంతా.. ఇప్పుడిదే పనిలో ఉన్నారు. తమ దగ్గర ప్రొడక్టులు కొని మార్కెట్‌లో విక్రయిస్తే.. భారీ లాభాలు వస్తాయని చెప్పి.. జనం ఆశల్ని, అమాయకత్వాన్ని క్యాష్ చేసుకునే ఏజెంట్లు ఎందరో ఉన్నారు. వి-కెన్, ఆమ్‌వే, క్యూ నెట్, వెస్టీజ్, హెర్బల్ లైఫ్, సంకల్ప్ మార్ట్, ఆఇజి టెక్నాలజీస్, ఫ్రైడే అప్ కన్సల్టెన్సీస్.. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్ చాంతాడంత ఉంటుంది. ఈ జాబితాలోనే ఇప్పుడు చేసింది ఏడీఎంఎస్ వ-బైక్స్.. ప్రతిసారీ కంపెనీ పేరు మారుతుంది. దాని బిజినెస్ మారుతుంది. అందులోని స్కీమ్ మారుతుంది కానీ.. స్కామ్ మాత్రం మారదు. అదే స్క్రిప్ట్, అదే సినిమా. అందులో క్యారెక్టర్స్ మారతాయి కానీ.. మోడల్ మారదు. లైఫ్‌లో సక్సెస్ అయ్యేందుకు.. దీనిని మించిన అవకాశం మరొకటి లేదు.. రాదు అని కథలు చెబుతారు. మిమ్మల్ని మోటివేట్ చేస్తారు. బ్రెయిన్ వాష్ చేస్తారు. వాళ్ల దారిలోకి తెచ్చుకుంటారు. మనల్ని మోసం చేయడమే కాదు.. మన చేత మరో నలుగురైదుగురిని మోసం చేయమని చెబుతారు. డబ్బుల మీదున్న ఆశతో.. ఎంతో మంది అమాయకులు ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీల ఏజెంట్లు చెప్పింది విని మోసపోతున్నారు. వాళ్లు చెప్పినట్లుగా చేస్తూ.. మిగతా వాళ్లు కూడా నష్టపోయేందుకు కారకులవుతున్నారు. ఇలా.. వందల కోట్లలో వసూలు చేసి.. బోర్డు తిప్పేసిన కంపెనీల లిస్టు చాలానే ఉంది. ఈజీగా మనీ వస్తుందని ఆశపడితే.. తర్వాత నష్టపోవాల్సిందే మీరేనని మార్కెట్ నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోడల్‌లో.. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన స్కామే.. ఏడీఎంఎస్ ఈ-బైక్స్. బైక్‌ల పేరుతో వ్యాపారం మొదలుపెట్టిన కంపెనీ.. ఆ బైక్‌లు అమ్మకుండా.. చైన్ మార్కెటింగ్ వ్యాపారం చేస్తోంది. రిజిస్ట్రేషన్, మెంబర్‌షిప్, ఐడీ జనరేషన్ అని చెబుతూ.. జనాల నుంచి డబ్బులు వసూలు చేసి.. వారినే మార్కెటింగ్ ఏజెంట్లుగా మార్చేస్తోంది. జనం డబ్బుతో.. వాళ్లు వ్యాపారం చేస్తూ.. వేల కోట్లు వెనకేస్తున్నారు. కొద్దో గొప్ప డబ్బులకు ఆశపడి.. ఈ స్కీమ్‌లో ఏజెంట్లుగా చేరుతున్న వాళ్లెందరో ఉన్నారు. ఎప్పుడైతే.. సైబర్ మోసాలపై జనంలో అవగాహన పెరగడం మొదలైందో.. కేటుగాళ్లంతా ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌పై కన్నేశారు. చైన్ బిజినెస్ పేరుతో.. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ద్వారా ప్రకటనలు గుప్పించి.. అమాయకులను మోసగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీములు నడిపే కేటుగాళ్లలో.. చాలా మంది మంది విదేశాల్లోనే ఉండి ఈ పిరమిడ్ రాకెట్ నడుపుతుంటారు. భారీ లభాలతో పాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట.. ఏజెంట్ల ద్వారా అమాయకులకు వల వేస్తున్నారు. ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలన్నీ.. స్టాలిన్ సినిమా తరహాలోనే ఉంటాయ్. నువ్వో ముగ్గురికి సాయం చెయ్.. ఆ ముగ్గురిని మరో ముగ్గురి చొప్పున సాయం చేయమని చెప్పండి లాగే ఉంటుంది వ్యవహారం. ఇలా చైన్ సిస్టమ్ ద్వారా డబ్బులు కట్టించుకోవడం, పెద్ద మొత్తంలో జమ అయ్యాక జెండా పీకేయడం ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నదే! ఇప్పుడు.. ఈ-బైక్స్ పేరుతో ఏడీఎంఎస్ చేస్తున్నది కూడా ఇదే దందా. కొన్ని కంపెనీలు తమ దగ్గర ప్రొడక్ట్స్ కొని.. మార్కెట్‌లో సేల్ చేసుకోమని చెబుతాయ్. ఇంకొన్ని.. కచ్చితంగా ప్రతి నెలా తమ ఉత్పత్తుల్ని కొనాల్సిందే అంటాయ్. తర్వాత.. మిగతా వాళ్లని కూడా చేర్పించమని చెబుతాయ్. కానీ.. ఏడీఎంఎస్ అలా కాదు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయ్. ఈ కంపెనీలు.. తమ డైట్ సప్లిమెంట్ల నుంచి క్లీనింగ్ ప్రొడక్ట్స్ వరకు ఏవైనా జనం భారీగా కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తాయ్. ఆ తర్వాత వీటిని సేల్ చేయడం ద్వారా ప్రజలు ఆదాయాన్ని సంపాదించే వీలుందని చెబుతాయి. నిజానికి ఇలాంటి కొన్ని స్కీమ్‌లలో భారీగా ఏజెంట్లను నియమించుకోవడం ద్వారా కంపెనీలు డబ్బులు సంపాదిస్తూ ఉంటాయ్. కింది స్థాయిలో జనం పెట్టే డబ్బు ద్వారానే.. పైస్థాయిలో ఉండేవారికి లాభాలు వస్తుంటాయ్. అయితే.. అతి తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే.. కచ్చితంగా అది మోసమేనని గ్రహించాలి. లేకపోతే.. మిమ్మల్ని ఆ స్కామ్‌లోకి దించి.. మీ డబ్బులు కొల్లగొడతారు. అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. ఈ చైన్ మార్కెటింగ్‌లో.. ముందు చేరిన వారికే లాభాలు వస్తాయి. ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. అందువల్ల.. ఇలాంటి నెట్‌వర్క్‌ల్లో ఎవరూ చేరొద్దు. ఆ కంపెనీలు పెట్టే మీటింగ్‌లకు కూడా వెళ్లొద్దు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

# వరంగల్ రైతుల ఆందోళన

హైదరాబాద్, మార్చి 5, మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన పనుల్లో భాగంగా.. రెవెన్యూ అధికారులు భూముల సర్వేకు వెళ్లారు. వారిని అడ్డుకుని రైతులు నిరసన చేపట్టారు. జై జవాన్.. జై కిసాన్ అంటూ రోడ్డెక్కి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న మామునూరు సీఐ ఒంటేరు, ఇతర పోలీస్ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. కానీ తమకు న్యాయం జరిగేదాక భూముల సర్వే ముందుకు కదలనివ్వబోమని రైతులు స్పష్టం చేశారు. దీంతో మామునూరు ఎయిర్ పోర్టు సమీపంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఎమ్మార్వో నాగేశ్వరరావు ఇతర అధికారులు అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మామునూరు ఎయిర్ పోర్టు పునరుద్ధరణకు తాము వ్యతిరేకం కాదని భూములు కోల్పోతున్న రైతులు స్పష్టం చేశారు. ఇక్కడ భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎయిర్ పోర్టు కింద భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని, అంతేగాకుండా విమానాశ్రయం పునరుద్ధరణలో భాగంగా నక్కలపల్లి రహదారిని క్లోజ్ చేస్తున్నారని.. తమకు ప్రత్యామ్నాయంగా మరో రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇక్కడి రైతుల డిమాండ్ ను ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించని లేని పక్షంలో భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎయిర్ పోర్టు భూసేకరణపై గతంలో నిర్వహించిన సమావేశం సందర్భంగా జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ రైతులకు హామీ ఇచ్చారని.. బహిరంగ మార్కెట్ ప్రకారం రేటు చెల్లిస్తామని చెప్పారని రైతులు చెబుతున్నారు. ఆ లెక్క ప్రకారం మామునూరు ఎయిర్ పోర్టు చుట్టుపక్కల రూ.5 కోట్లకుపైగా ధర పలుకుతోందని, దాని ప్రకారమే అన్నదాతలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులు కోరుకున్న ప్రకారం వ్యవసాయ భూములు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడేమో తమకు ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండానే సర్వే మొదలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి కొండా సురేఖ,

ఎమ్మెల్యేలు మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నక్కలపల్లి, గుంటూరుపల్లి, గాడిపల్లి, నల్లకుంట గ్రామాలకు చెందిన రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టడంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. రైతుల ధర్నాకు ఎలాంటి అనుమతి లేదని, వెంటనే ఆందోళన విరమించాల్సిందిగా సూచించారు. కానీ తమ జీవనోపాధికి సంబంధించిన అంశం కావడంతో అన్నదాతలు రోడ్డుపై నినాదాలతో హోరెత్తించారు. దాదాపు 200 మంది వరకు పోలీసులు మోహరించడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొనగా.. తమకు న్యాయం జరిగేంతవరకు ఎయిర్ పోర్టుకు భూములు ఇచ్చేది లేదని అక్కడి రైతులు స్పష్టం చేస్తున్నారు. విమానాశ్రయ పునరుద్ధరనకు ఇంకో 253 ఎకరాలు సేకరించాల్సి ఉండగా.. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# టీడీపీలోకి మల్లన్న



## గ్రేటర్ కోసం కసరత్తు

హైదరాబాద్, మార్చి 5, ఆంధ్రప్రదేశ్‌లో విజయం తర్వాత తెలుగుదేశం పార్టీ కేడర్ జోష్‌లో ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వడానికి చంద్రబాబు ప్లాన్ చేస్తున్నట్టు పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది. తెలంగాణలో పార్టీని యాక్టివ్ చేయాలని ఇక్కడి నేతలు చాలా రోజులుగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. మరో 10 నెలల్లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలపై టీడీపీ ఫోకస్ పెట్టినట్టు సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే గ్రౌండ్ వర్క్ కూడా ప్రారంభం అయినట్టు తెలుస్తోంది. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేసిన పొలిటికల్ కన్సల్టెన్సీ 'షోటైమ్'.. ఇప్పుడు హైదరాబాద్‌లో కార్యాకలాపాలు ప్రారంభించిందిహైదరాబాద్‌లో ఆఫీసు ఏర్పాటు చేసిన షోటైమ్ ప్రతినిధులు.. టీడీపీ కోసం గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలే ట్రార్గెట్‌గా ఆ సంస్థ ప్రతినిధులు పని చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా గతంలో టీడీపీ విజయం సాధించిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ సానుభూతిపరులను వీరు కలుస్తున్నారు. టీడీపీ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేయబోతోందని.. అందరూ గతంలో లాగా యాక్టివ్ అవ్వాలని సూచించినట్టు తెలిసింది. ఎల్బీనగర్, మహేశ్వరం, కూకట్‌పల్లి, జూబ్లిహిల్స్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం గ్రౌండ్ వర్క్ చేస్తున్నట్టు సమాచారం. ఇక్కడ చేస్తున్న వర్క్, పురోగతి గురించి ఎప్పటికప్పుడు చంద్రబాబుకు తెలియజేస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్నికలకు ఇంకా 10 నెలలు సమయం ఉండటంతో ముఖ్యనేతలు డైరెక్ట్‌గా ఇన్వాల్వ్ అవ్వడం లేదని తెలుస్తోంది. ఎన్నికలు సమీపించాక.. నారా లోకేష్ ఫోకస్ పెడతారని విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా ఈ మూడు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా వెస్టర్న్ హైదరాబాద్‌లో టీడీపీ, జనసేన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈస్టర్న్ హైదరాబాద్‌లో బీజేపీ ఇంపాక్ట్ ఉండే ఛాన్స్ ఉంది. దీంతో మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తే.. ఏపీలో మాదిరిగా విజయం సాధిస్తామని.. హైదరాబాద్‌కు చెందిన టీడీపీ సీనియర్ నేత ఒకరు చెప్పారుఇటీవల తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. దీంతో ఆయన టీడీపీలో చేరవచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది. కొత్త పార్టీ కూడా పెడతారనే ప్రచారం జరిగినా.. తెలుగుదేశం వైపే మొగ్గుచూపే అవకాశం ఉందని అంటున్నారు. అటు టీడీపీ మల్లన్నను చేర్చుకోవడానికి చర్చలు జరిపినట్టు వార్తలు వచ్చాయి. మల్లన్న పార్టీలో చేరితే ప్లస్ అవుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. ఆయకే తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవీ ఇవ్వొచ్చనే వార్తలు కూడా వచ్చాయి. గతేడాది టీడీపీ సభ్యత్వ కార్యక్రమం చేపట్టింది. దీనికి తెలంగాణలోనూ మంచి స్పందన లభించింది. తెలంగాణ నుంచి లక్షా 21 వేల మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. దీంట్లో దాదాపు హైదరాబాద్ నుంచే ఎక్కువ మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకే చంద్రబాబును కలుస్తున్న తెలంగాణ నేతలు.. పార్టీపై ఫోకస్ పెట్టాలని కోరుతున్నారు.

# ప్రతిపక్షం కమలమేనా...




హైదరాబాద్, మార్చి 5, తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏం జరిగింది? రాబోయే రోజుల్లో రాజకీయ పరిణామాలు ఏ విధంగా ఉండబోతున్నాయి? బీజేపీకి అంతర్గతంగా బీఆర్ఎస్ మద్దతు ఇచ్చినట్టేనా? ఈ ఎన్నికల్లో బోర్లా పడిందెవరు? బీఆర్ఎస్ కోట క్రమంగా బద్దలువుతున్నట్లేనా? అవుననే సంకేతాలు ఆ పార్టీ నేతల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు దాదాపుగా వెలువడ్డాయి. కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీల్లో బీజేపీ మద్దతుదారు మల్క కొమరయ్య గెలిచారు. దీంతో ఆ పార్టీ నేతలు ఫుల్‌ఖుషీగా ఉన్నారు. బీజేపీ గెలుపు తర్వాత మీడియా ముందుకొచ్చేశారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రధాని నరేంద్రమోదీ పట్ల నమ్మకంతో ఈ తీర్పు వచ్చిందన్నారు సంజయ్. ఈ గెలుపు టీచర్లకు, మోదీకే అంకితమన్నారు. ఇది మామూలు విజయం కాదన్నారు. దేశ వ్యాప్తంగా మేధావి వర్గమంతా మోదీ పట్ల నమ్మకంతో ఉన్నారు. బడ్జెట్‌లో ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు వల్లే ఈ తీర్పు ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఆనాడు కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా ఎమ్మెల్సీగా ఏవీఎన్ రెడ్డిని గెలిపించారన్నారు కేంద్రమంత్రి సంజయ్. 317 జీవోపై బీజేపీ కార్యకర్తలు చేసిన పోరాటాలు, లాఠీ ఛార్జ్ గుర్తుంచుకున్న ఉపాధ్యాయులు కొమరయ్యను గెలిపించారని తెలిపారు. హేళన చేసిన వారందరీ చెంప చెళ్లుమన్పించేలా తీర్పు ఇచ్చారన్నారు. బండి సంజయ్ చెప్పిన పాయింట్‌లో కీలకమైనది ఉద్యోగులకు పన్ను మినహాయింపు. ఎన్నికల్లో దీని ప్రభావం బాగానే కనిపించింది. ఇది ఎవరు నమ్మినా నమ్మకపోయినా ముమ్మాటికీ నిజం. ఎందుకంటే ఉపాధ్యాయులంతా ఆ పన్ను పరిధిలో వారే కావడం బీజేపీకి కలిసొచ్చింది. మొన్నటికి మొన్న ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు పన్ను సడలింపు కలిసి వచ్చిందని కొందరు ఆ పార్టీ నేతలు బలంగా చెప్పారు కూడా. ఇక్కడా అలాంటి ఫలితమే పునరావృతమైందిఇక్కడ బీజేపీ గెలిచిందని చెప్పడం కంటే.. బీఆర్ఎస్ కోటకు బీటలు పడుతున్నాయని అంటున్నారు. సింపుల్‌గా చెప్పాలంటే నార్త్ తెలంగాణలో బీజేపీ తన జోరును కొనసాగించింది. అసెంబ్లీ, లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో జోరు కొనసాగించింది. ఒకప్పుడు అక్కడ బీఆర్ఎస్ చాలా బలంగా ఉండేది. ఇప్పుడు చతకిలపడిపోయింది. ఇలాంటి ఫలితాలు వస్తాయని ముందుగానే కారు పార్టీ భావించి, ఎన్నికల నుంచి తప్పుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల ముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ కీలక నేతలు సమావేశాలు నిర్వహించారు. తమ ఓటు బ్యాంకు ఈసారి బీజేపీకి వేయాలని సంకేతాలు ఇచ్చారనే వాదనలు సైతం లేకపోలేదు. ఈ క్రమంలో బీజేపీ గెలిచిందని మరోవైపు వినిపిస్తున్నమాట. టీచర్ ఎమ్మెల్సీపై అధికార కాంగ్రెస్ పెద్దగా ఫోకస్ చేసిన సందర్భం లేదు. బీఆర్ఎస్ తీసుకొచ్చిన జీవో 317 పై వ్యతిరేకంగా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతున్నాయి. బీజేపీ గెలుపు వెనుక ఇది కూడా ఓ కారణమని అంటున్నారు. ఈ విషయంపై అధికార కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టింది. న్యాయ నిపుణులతో మంతనాలు చేస్తోంది. కొద్దిరోజుల్లో ఈ అంశం కూడా ఓ కొలిక్కి వచ్చే అవకాశముంది. జరుగుతున్న పరిణామాలు, ఫలితాలు చూస్తేంటే ఉత్తర తెలంగాణలో బీజేపీ క్రమంగా పాగా వేస్తుందనే చెప్పాలి.

# ఎకరం 50 కోట్లు

### అమ్మకానికి 500 ఎకరాలు

హైదరాబాద్, మార్చి 5 తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్ గచ్చిబౌలిలో 400 ఎకరాల సర్కార్ భూమిని వేలం వేయాలని భావిస్తోంది. శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి గ్రామం పరిధిలో ఈ భూమి ఉండగా.. టీజీఐఐసీకి ద్వారా విక్రయించేందుకు ప్రయత్నిస్తుంది. సంక్షేమ పథకాల అమలు, ఇతర ఇవసరాల కోసం డబ్బు సమీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అంతర్జాతీయ స్థాయి లేఔట్‌ను అభివృద్ధి చేసి.. వేలం ద్వారా భూములను విక్రయించేందుకు కన్సల్టెంట్ నియామకానికి టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్ల దాఖలుకు గడువిచ్చారు. డిసెంబర్ 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మొదటి భూ వేలం ఇదే కానుంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వం రూ. 20,000 కోట్లకు పైగా సేకరించాలని భావిస్తోంది. కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25(ఖ) వద్ద ఉన్న 400 ఎకరాల స్థలంలో 'మాస్టర్ ప్లాన్ లేఅవుట్'ను అభివృద్ధి చేయాలని ఎఉఎఎఅ యోచిస్తోంది. ఈ భూమిని అభివృద్ధి చేసి దశలవారీగా విక్రయించనున్నారు. అత్యంత ఖరీదైన వెస్ట్ జోన్ పరిధిలో, ఐటీ కంపెనీలకు అతి సమీపంలోని ఈ భూమి ఉంది. హైటెక్ సిటీ నుంచి 7-8 కి.మీ, పంజాగుట్ట క్రాస్‌రోడ్స్ నుండి 15-18 కి.మీ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి 22 కి.మీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దాదాపు 33 కి.మీ దూరంలో ఈ స్థలం ఉంది. అక్కడి లేఔట్లలో గజానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పలికే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుంది. ఎకరాల్లో అయితే ఎకరం రూ. 50 కోట్లు పలుకుతుందని అంచనా. లేఔట్ మాస్టర్ ప్లాన్ తయారీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వేలం ద్వారా ప్లాట్ల విక్రయాలు తదితర కార్యక్రమాల నిర్వహణ కోసం తాజాగా.. రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌ని ఆహ్వానించారు. క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్ (క్యూసీబీఎస్) పద్ధతిలో బిడ్డర్‌ను ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, భూములు వేలం ద్వారా వచ్చే రూ.20 వేల కోట్లను రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సహా ఇతర పథకాల కోసం వెచ్చించనున్నట్లు తెలిసింది.

## మీనాక్షి మార్క్..సమీక్షలు షురూ...

హైదరాబాద్, మార్చి 5, ఏఐసీసీ కొత్త ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పనితీరుపై సమీక్షలు నిర్వహించనున్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో పార్టీ పనితీరును తెలుసుకునేందుకు గాంధీభవన్‌లో 4వ తేదీ నుంచి సమీక్షలు నిర్వహించారు. తొలుత మంగళవారం మెదక్, మల్కాజిగిరి పూర్తి చేయగా రెండో రోజు బుధవారం కరీంనగర్, ఆదిలాబాద్ లోక్‌నభ నియోజకవర్గాల నేతలందరితో సమీక్షించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగే సమీక్షలకు.. ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీలు, ఇతర ముఖ్యనేతలందరూ రావాలని ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లాయి. మీనాక్షి నటరాజన్ ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తరవాత.. నిర్వహించబోతున్న తొలి సమీక్ష సమావేశాలు కావడంతో వీటికి ప్రాధాన్యం ఏర్పడింది. అటు గాంధీభవన్‌కు చాలామంది నేతలు క్యూకడుతున్నారు. ఎమ్మెల్యేలు ఎన్నుకునే ఎమ్మెల్సీ ఎన్నికలకు నలుగురు అభ్యర్థులను ఈ నెల 10లోగా పార్టీ ప్రకటించాల్సి ఉంది. వీటికి సంబంధించి పెద్దసంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఇన్‌ఛార్జిని ప్రసన్నం చేసుకునేందుకు, తమ పనితీరును వివరించేందుకు నేతలు గాంధీభవన్ చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఇటీవల ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపింది. ఆ మేరకు కాంగ్రెస్‌లో పదవుల భర్తీ ఉంటుందని నేతలు చెబుతున్నారు. ప్రధానంగా మాల, మాదిగ వర్గాల నేతలకు ఎమ్మెల్సీ టికెట్లు, నామినేటెడ్, మంత్రి పదవుల భర్తీలో ఎస్సీ వర్గీకరణ ప్రకారం ప్రాధాన్యమిస్తారని ప్రచారం జరుగుతోంది. అటు తమకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని రెండు సామాజిక వర్గాల నేతలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. మాల, మాదిగలకు సంబంధించి.. ఒక వర్గానికి అవకాశమిస్తే మరో వర్గానికి ప్రభుత్వ సలహాదారు లేదా రాబోయే మంత్రివర్గ విస్తరణలో సర్దుబాటు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఇక బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లలో రెండు ఇవ్వాలని ఈ వర్గాల నేతలు పట్టుబడుతున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పూర్తయితే ఏయే వర్గాలకు అవకాశం ఇస్తారనేది తేలుతుంది. ఇటు మిగిలిన సామాజిక వర్గాలకు నామినేటెడ్, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ పదవులు ఇస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పీసీసీ రాష్ట్ర కార్యవర్గ కూర్పు కూడా ఈ నెల 20లోగా పూర్తవుతుందని నేతలు అంచనా వేస్తున్నారు. పార్టీ పరిస్థితులు, సమస్యలు, పరిష్కార మార్గాలపై ఆయా నేతలపై మీనాక్షి నటరాజన్ చర్చించనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటి నుంచే ఆమె ఫోకస్ చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమావేశాలు నిర్వహించనున్నారు. దీని తర్వాత జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కార్యకర్తలతో భేటీ కావాలని భావిస్తున్నట్లు గాంధీ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామ స్థాయిలో జరగడంతో వాటిపై తొలుత దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం అయితే ఓటు బ్యాంక్ చెదిరిపోకుండా ఉంటుందన్నది హైకమాండ్ ఆదేశాలు. ఆ విధంగా ఆమె అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తర్వాత మీనాక్షి నిర్వహిస్తున్న ఫస్ట్ సమీక్ష సమావేశాలు ఇవే. నేతలు సైతం వీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. పెద్ద సంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. కొత్త ఇన్‌ఛార్జిని ప్రసన్నం చేసుకునేందుకు నేతలు సైతం సిద్ధమవుతున్నవారు. దీని తర్వాత సామాజిక వర్గాలకు నామినేటెడ్, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ పదవులు ఇస్తారనే వార్తలు లేకపోలేదు. పీసీసీ కార్యవర్గ కూర్పు ఈ నెల 20లోగా పూర్తి అవుతుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# వరంగల్ కాంగ్రెస్ లో కుమ్ములాటలు

వరంగల్, మార్చి 5, రాజకీయాల్లో ప్రత్యర్థి పార్టీల మధ్య సవాళు,, వార్నింగులు సహజమే.. అయితే అక్కడ పరిస్థితి డిఫరెంట్‌గా కనిపిస్తోంది. తలతిక్క వేషాలు వేస్తే ఊరుకునేది లేదు. నా అనుచరులను డిస్టర్బ్ చేస్తే సహించేది లేదు.. ఇది ఓ ఎమ్మెల్యే తన సొంత పార్టీ నేతకు బహిరంగంగా ఇచ్చిన వార్నింగ్. ఈ వార్నింగ్ తో ఆ నియోజకవర్గ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. దీంతో పార్టీలో ఏం జరుగుతోందో అంటూ చర్చలు మొదల య్యాయి. ఇంతకీ ఈ మాస్ వార్నింగ్ ఇచ్చిందెవరు..? ఆయనకు ఎందుకని అంత కోపం వచ్చింది?ఓరుగల్లు రాజకీయాల లో ప్రత్యర్థి పార్టీల నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు, వివాదాలు సహజం. కానీ ఓ ఎమ్మెల్యే మాత్రం తన సొంత పార్టీ నాయకునికి బహిరంగంగా వార్నింగ్ ఇచ్చి పొలిటికల్ సర్కిల్స్ లో హీట్ పెంచారు. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే సహించేది లేదని బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. కీలక సంస్థల ప్రధాన కార్యాలయాలు , వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ భవనాలు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోనే ఉన్నాయి.అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరంగల్ పశ్చిమ స్థానం నుండి పోటీ చేసేందుకు ఆశావహులు భారీ స్థాయిలో పోటీపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నుండి సుమారు 15 మంది నాయకులు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. హనుమకొండ డీసీసీ ప్రెసిడెంట్ నాయిని రాజేందర్ రెడ్డి, జంగా రాఘవరెడ్డిల మధ్య టికెట్ పోరు రసవత్తరంగా సాగింది. వరంగల్ పశ్చిమలో తనకు టికెట్ ఇవ్వకుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని బహిరంగంగానే జంగా రాఘవరెడ్డి తన అసంతృప్తి వెళ్ళగక్కారు. అయితే చివరకు అధిష్టానం జంగా రాఘవరెడ్డిని కాదని నాయిని రాజేందర్ రెడ్డికి టికెట్ ఇచ్చింది. డీసీసీ పదవి విషయంలోనూ గతంనుండే జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి ల మధ్య వర్గ పోరు నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలలో నాయిని రాజేందర్ రెడ్డి ఘన విజయం సాధించడంతో జంగా రాఘవరెడ్డి సైలెంట్ అయ్యారు. పార్టీకి డామేజ్ జరగద్దని భావించిన అధిష్టానం జంగా రాఘవ రెడ్డికి పామ్ ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ నామినేటెడ్ పదవి కట్టబెట్టింది.ఇన్నాళ్లు సైలెంట్ గా ఉన్న జంగా రాఘవరెడ్డి అనుచరులు గత కొద్ది రోజుల నుండి సోషల్ మీడియా వేదికగా పార్టీకి నష్టం కలిగేలా ప్రచారం సాగిస్తున్నారట. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యే నాని రాజేందర్ రెడ్డికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారట. గత పది ఏళ్ల కాలంలో పార్టీ అధికారంలో లేకున్నా అందరినీ కంటికి రెప్పలా కాపాడుకున్నాడని తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి పార్టీకి సేవ చేశారని మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తున్నారట. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కారణంగా జంగాకు టికెట్ ఇవ్వలేదని మరోసారి అవకాశం ఇస్తామని హైకమాండ్ బుజ్జగించిందని..అందుకే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలంటూ కాంగ్రెస్ సేవల గ్రూపులో ప్రచారం చేస్తున్నారట. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ టికెట్ కోసం ప్రచారం చేయడమే కాకుండా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్ కేడర్ను రెండు వర్గాలుగా చీల్చే ప్రయత్నాలు చేస్తున్నారని నాయని అనుచరు? చెప్పుకుంటున్నారు. జంగాకి ఎమ్మెల్సీ పదవి వస్తే మళ్లీ కాంగ్రెస్ క్యాడర్ రెండుగా చీలిపోతుంది అని ఇద్దరి మధ్య ఆధిపత్య పోరులో పార్టీ మనుగడకే మోసం వస్తుందని సీనియర్ కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.గత ఎన్నికలకు ముందు సైతం జంగా రాఘవరెడ్డి టిఆర్ఎస్ నేతలకు అమ్ముడుపోయారని కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి ప్రయత్నించారని నాయని రాజేందర్ రెడ్డి వర్గం ఆరోపిస్తోంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో సైతం సొంత పార్టీ అభ్యర్థి అయిన నాయిని రాజేందర్ రెడ్డి ఓటమి కోసం టిఆర్ఎస్ అభ్యర్థితో చేతులు కలిపాడని ఆరోపిస్తున్నారు. అలాంటి వ్యక్తికి ఎమ్మెల్సీ పదవి కట్టబెడితే పార్టీని సర్వనాశనం చేస్తాడని జంగా రాఘవరెడ్డి పై తీవ్ర స్థాయిలో ఫైర్ అవుతున్నారు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి. కాజీపేట పరిధిలోని కొంతమంది నాయకులు జంగా రాఘవరెడ్డి అనుకూలంగా ప్రచారం చేస్తుండడంతో విషయం తెలుసుకున్న నాయని తీవ్రంగా ఫైర్ అయ్యారు. టిఆర్ఎస్ తో చేతులు కలిపి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని కాంగ్రెస్ కేడర్ను అయోమయానికి గురి చేస్తున్నారని జంగా రాఘవరెడ్డిని తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. అంతేకాకుండా తనకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని బీఆర్ఎస్ నేతలతో కుమ్మక్కై తన వెనుక గోతులు తీస్తున్నారని దుయ్యబట్టారు. ల్యాండ్ కబ్జాలు, సెటిల్మెంట్లు లేకుండా ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో తిరిగి దందాలు మొదలు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నారని.. ఇలా చేస్తే సహించేది లేదని జంగా రాఘవరెడ్డి అనుచరులకు బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు.మొత్తమ్మీద ఇన్నాళ్లు సైలెంట్ గా ఉన్న జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి మధ్యలోని వర్గపోరు, ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బహిరంగంగా జంగా రాఘవరెడ్డి, అతని అనుచరులకు వార్నింగ్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలో ఏం జరగబోతుందోననే ఉత్కంఠ మొదలైంది. స్థానిక సంస్థలు సమీపిస్తున్న వేళ ఇద్దరి మధ్య వర్గ పోరు ఎక్కడికి దారితీస్తుందోననే చర్చ నడుస్తోంది.

## ఓపెన్ గార్బేజీల వద్ద వాయిస్ అసిస్టెన్స్ కెమెరా

హైదరాబాద్, మార్చి 5, నాగార్జున హీరోగా ఆ మధ్య వచ్చిన సూపర్ సినిమాలో బ్రహ్మానందం దగ్గర అబద్ధాలు కనిపెట్టే మిషన్ ఉంటుంది. అలీని ఓ కేసులో బ్రహ్మానందం ప్రశ్నలు అడుగుతుంటాడు. ఆ సమయంలో అలీ అబద్ధం చెప్పిన ప్రతిసారి మిషన్ అరుస్తుంది. ఇలాగే, మనం రోడ్లపై చెత్త వేసిన ప్రతిసారి మిషన్ అరిస్తే ఎలా ఉంటుంది?రోడ్లపై చెత్త వేయొద్దని జీహెచ్ఎంసీ ఎంతగా చెబుతున్నా చాలా మంది వినిపించుకోరు. బస్సుల్లో నుంచి వెళ్తూ కొందరు కిటిల్లోనుంచే పేపర్లు పడేస్తారు. రోడ్డుపక్కన దుకాణంలో కొనుక్కుని తిని రోడ్డుపైనే అందుకు సంబంధించిన చెత్తను పడేస్తుంటారు. బైకుపై వెళ్తూ రోడ్డుపైనే చెత్తను పడేస్తూ వెళ్తుంటారు కొందరు. ఇంట్లోని చెత్తను మోసుకొచ్చి ఎక్కడపడితే అక్కడ పడేస్తుంటారు.ఇటువంటి వారందరినీ పసిగట్టి ఓ మిషన్ అరిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన జీహెచ్ఎంసీ అధికారులకు కూడా వచ్చింది. అంతేకాదు, రోడ్డు మీద చెత్త వేస్తే కిస్సిక్ మంటూ ఫొటో కూడా తీస్తుంది ఈ మిషన్. దీన్ని హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో ఏర్పాటు చేశారు. అక్కడి ఓపెన్ గార్బేజీల వద్ద వాయిస్ అసిస్టెన్స్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇది విజయవం తమైతే మరిన్ని ప్రాంతాల్లోనూ ఈ వాయిస్ అసిస్టెన్స్‌ను ఏర్పాట్లు చేయను న్నారు.బంజారా హిల్స్‌లో ఓపెన్ గార్బేజీల వద్ద ఏర్పాటు చేసిన వాయిస్ అసిస్టెన్స్ కెమెరా ఎవరైనా చెత్త వేసేందుకు వస్తే ఫొటో తీస్తోంది. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీనగర్ లో ఓపెన్ గార్బేజీ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన వాయిస్ అసిస్టెన్స్ కెమెరా సెన్సార్.. ఎవరైనా చెత్త వేస్తే వారిని గుర్తిస్తోంది. అనంతరం వాయిస్ కంట్రోల్‌కు అది సందేశం పంపుతుంది.ఆ వెంటనే అక్కడ చెత్త వేయకూడదని తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మైకు అరుస్తుంది. ఈ ప్రయోగంబహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసేవారి సంఖ్య తగ్గుతుందని అధికారులు అంటున్నారు. ఇక్కడ చేస్తున్న ఈ ప్రయోగం విజయవంతమైతే జూబ్లీహిల్స్ సర్కిల్ 18లో కూడా వీటిని ఏర్పాటు చేయను న్నారు.ప్రస్తుతం పలు ప్రాంతాల్లో వాయిస్ అసిస్టెన్స్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే వెంటనే స్థానిక ఎస్ఎఫ్ఎ, చెత్తను సేకరించే ఆటో రిక్షా కార్మికుడికి కూడా సందేశంతో పాటు వీడియో, ఫొటో వెళ్తాయని అంటున్నారు. చెత్త వేస్తున్న వారిని దీని ద్వారా గుర్తించి ఇటువంటి పనులు చేయకూడదని చెబుతారని అన్నారు.మరోవైపు, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) డంపర్‌బిన్లలో చెత్త దాదాపు 75 శాతం నిండగానే అలర్ట్ చేసేలా ఆధునిక డంపర్‌బిన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే విధించే పెనాల్టీలకు ఇకపై ఈ చలాన్‌లను జారీ చేయనుంది. యూపీఐ చెల్లింపుల ద్వారానే ఆ జరిమానాలకు స్వీకరించనుంది.


## దిగొచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

న్యూయార్క్, మార్చి 5, ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ అమెరికాతో ఖనిజాల, భద్రతా ఒప్పందంపై సంతకం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బలమైన నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శుక్రవారం శ్వేతసౌధంలో ట్రంప్‌తో తన సమావేశం నిరాశపరిచిందని వోలోడిమిర్ జెలెన్‌స్కీ అంగీకరించారు. అయితే ఆయన మరోసారి ఉక్రెయిన్ పట్ల తన నిబద్ధతను వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ జావెలిన్ క్షిపణులను ఇచ్చినందుకు ట్రంప్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సరైన సమయమని, పరిస్థితులను చక్కదిద్దేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.ఉక్రెయిన్ శాంతి కోస తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించాలనుకుంటున్నట్లు వోలోడిమిర్ జెలెన్‌స్కీ ఒక ప్రకటనలో తెలిపారు. 'మనలో ఎవరూ అంతులేని యుద్ధాన్ని కోరుకోరు. శాశ్వతంగా శాంతిని తీసుకురావడానికి ఉక్రెయిన్ త్వరలో చర్చలకు కూర్చోవడానికి సిద్ధంగా ఉంది. శత్రుత్వానికి ముగింపు పలికేందుకు సత్వర చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. మొదటి దశలో ఖైదీల విడుదల, వైమానిక దాడులను ఆపేందుకు కాల్పుల విరమణ ఉంటుంది. రష్యా కూడా అదే పని చేస్తే యుద్ధాన్ని చల్లార్చవచ్చు. తదుపరి చర్యల కోసం వేగంగా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం. బలమైన తుది ఒప్పందాన్ని అంగీకరించడానికి యూఎస్‌తో కలిసి పనిచేస్తాం.' అని చెప్పారు.వోలోడిమిర్ జెలెన్‌స్కీ అమెరికా మద్దతును ప్రశంసించారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి యూఎస్ ఎంత దోహదం చేసిందో మేం నిజంగా అభినందిస్తున్నామన్నారు. అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌కు జావెలిన్ క్షిపణులను అందించినప్పుడు పరిస్థితులు మారిన క్షణాన్ని మనం మర్చిపోలేమన్నారు.వోలోడిమిర్ జెలెన్‌స్కీ ఖనిజ, భద్రతా ఒప్పందం గురించి మాట్లాడుతూ.. 'ఉక్రెయిన్ ఏ సమయంలోనైనా, ఏ సౌకర్యవంతమైన ఫార్మాట్లోనైనా దానిపై సంతకం చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ ఒప్పందాన్ని మరింత భద్రత, దృఢమైన భద్రతా హామీల దిశగా ఒక అడుగుగా మేం భావిస్తున్నాం. ఇది సమర్థవంతంగా పనిచేస్తుందని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.' అని చెప్పారు.అయితే సైనికపరంగా ఉక్రెయిన్‌కు వెళ్లాల్సిన సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. తనతో చర్చలు విఫలమైన తర్వాత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే దీని తర్వాత కొన్ని గంటల్లోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ దిగివచ్చారు. తమ దేశంలో ఖనిజాలు తవ్వుకునేందుకు ఒప్పందానికి సిద్ధమేనని చెప్పారు.




## కల్పన ఆత్మహత్యకు కారణం ఏమిటీ...

హైదరాబాద్, మార్చి 5,టాలీవుడ్ మ్యూజిక్ ఇండస్ట్రీ ఒక్కసారి షాక్‌కి గురయింది. ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యకు పాల్పడటం తెలుగు చలన చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్ అయింది. బలవన్మరణానికి పాలు పడాల్సిన అవసరం ఆమెకు ఏం వచ్చింది? ఎందుకు ఈ పని చేశారు? అనే కారణాలు తెలియాల్సి ఉంది. నిజాంపేటలో కల్పన నివాసం ఉంటున్నారు. ఒక గేటెడ్ కమ్యూనిటీలోని విల్లా తీసుకుని జీవిస్తున్నారు. ఆ విల్లాలో నిద్ర మాత్రలు మింగి ఆవిడ ఆత్మహత్యకు పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పోలీసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కల్పన అపస్మారక స్థితిలో ఉన్నారని తెలిసింది. ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.కల్పన ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆమె భర్త చెన్నైలో ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. రెండు రోజులుగా విల్లా గేట్లు ఓపెన్ చేయకపోవడంతో అసోసియేషన్ సభ్యులకు సందేహం కలిగి ఆవిడకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదట. దాంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాళ్ళు వచ్చి గేట్లు ఓపెన్ చేయగా... కల్పన అపస్మారక స్థితిలో ఉన్నారట.ప్రస్తుతం కల్పనకు వెంటిలేటర్ మీద వైద్యులు చికిత్స అందిస్తున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆవిడ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందట. కొన్ని గంటలు గడిస్తే గానీ ఏ విషయం చెప్పలేమని చెప్పారట. కల్పనా రాఘవేందర్ హైదరాబాద్ సిటీలో సెటిల్ అయినప్పటికీ ఆమె స్వస్థలం తమిళనాడు రాజధాని చెన్నై. చిన్నతనం నుంచి సంగీతం మీద ఆసక్తి ఉండేది. కర్ణాటిక్ మ్యూజిక్ నేర్చుకున్నారు. మలయాళ ఛానల్ ఏషియానెట్ నిర్వహించిన 'స్టార్ సింగర్' సీజన్ 5 విజేతగా నిలిచారు. ఆ షో 2010లో జరిగింది. దానికి 20 ఏళ్ళ ముందు నుంచి ఆవిడ పాటలు పాడుతున్నారు. తెలుగు 'బిగ్ బాస్' సీజన్ 1లో కూడా పార్టిసిపేట్ చేశారు. పలు సినిమాల్లో సూపర్ హిట్ సాంగ్స్ పాడారు. కల్పనను ఆస్పత్రికి తరలిస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందులో ఆవిడ ఫేస్ చూసి ఆడియన్స్ షాక్ అవుతున్నారు. కల్పన ముఖం అంతలా మారిందేమిటి? అని ఆశ్చర్యపోతున్నారు. ఆవిడ త్వరగా కోలుకోవాలని పరిశ్రమ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు. కల్పన ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో విల్లాలో ఇతరులు ఎవరైనా ఉన్నారా? ఆవిడ కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నారు? పోలీసులకు కల్పన ఆత్మహత్యకు పాల్పడిన సమాచారం ఎవరు అందించారు? అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాథమిక దర్యాప్తు జరుగుతోందని సమాచారం అందుతుంది. ఏది ఏమైనా ప్రజెంట్ ఆవిడ సూసైట్ అటెంప్ట్ న్యూస్ అందరికీ షాక్ అని చెప్పడంలో ఎటువంటి సందేహం అవసరం లేదు.



## అమెరికాలో కాల్పులు.. తెలంగాణ విద్యార్థి మృతి



చదువు లేదా ఉద్యోగం కోసం చాలా మంది భారతీయులు అగ్రరాజ్యం అమెరికాకు వెళ్తుంటారు. ఇందులో తెలుగువారి సంఖ్య కూడా ఎక్కువే. అయితే అలా చదువు కోసం అమెరికా వెళ్లిన ఓ తెలంగాణ విద్యార్థి కథ విషాదాంతమైంది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థి అమెరికాలో దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కేశంపేటకు చెందిన గంప ప్రవీణ్(27) ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లాడు. అక్కడ మిల్వాకీ కౌంటీలో ఉంటూ ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అయితే దుండగులు ప్రవీణ్‌పై కాల్పులు జరపగా.. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్ మరణవార్త తెలియగానే అతని కుటుంబసభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. అతని మృతితో కేశంపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## ప్రశాంతగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

### ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు

### ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతించిన అధికారులు

హైదరాబాద్, తెలంగాణలో ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించేది లేదన్న నిబంధనను ఈసారి తొలగించారు. ఐదు నిమిషాలు అలస్యంగా వచ్చినా విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. చాలా మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గంట ముందే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థుల హాల్ టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ పరీక్షలు ఈ నెల 25కి ముగిననున్నాయి. ఫస్టియర్, సెకండియర్ కలిపి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 9,96,971 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఈ మేరకు అధికారులు రాష్ట్రంలో 1,532 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో అత్యధికంగా హైదరాబాద్ లో 244, రంగారెడ్డి జిల్లాలో 185, మేడ్చల్ జిల్లా లో 150 కేంద్రాలు ఉన్నాయి. అయితే పరీక్షకు వారం ముందే ప్రశ్నా పత్రాలు, ఓఎంఆర్ ఆన్సర్ షీట్లు జిల్లా కేంద్రాలకు చేరాయి. ఒక్క నిమిషం లేట్ నిబంధనను ఈసారి ఇంటర్మీడియట్ బోర్డు సడలించింది. ఈ మేరకు 9.05 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఎగ్జామ్ సెంటర్లలోకి స్మార్ట్ వాచ్ లు, మొబైల్ ఫోన్లు ఎలక్ట్రికల్ పరికరాలు అనుమతించబోమని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని అన్నారు.

## భర్తను కొడుకు, భార్య హతమార్చేశారు

హైదరాబాద్, మార్చి 5, )సమాజంలో రోజురోజుకీ హత్యాకాండలు పెరిగిపోతున్నాయి. మనిషిని మనిషి చంపుకోవటమే దారుణం.. అలాంటిది అయినవాళ్లు తమ ఆత్మీయులను, కుటుంబసభ్యులను దారుణంగా కడతేర్చుతున్నారు. మనిషి మృగంలా మారిపోయి ఇష్టారీతిన నేరాలకు పాల్పడుతున్నాడు. తాజాగా హైదరాబాద్ మహానగరంలో జరిగిన ఓ దారుణ ఘటన ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసింది. అత్యంత దారుణంగా ఓ వ్యక్తి కాళ్లు, చేతులు కట్టేసి స్వయానా కట్టుకున్న భార్య, కన్న కొడుకే ఈ హత్య చేయడం గమనార్హం.బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిరిధిలోని క్రిస్టల్ టౌన్‌లో ఈ దారుణ హత్య చోటు చేసుకుంది. వెటర్నరీ డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మసీఉద్దీన్ అనే వ్యక్తిని అతి కిరాతకంగా రెండో భార్య షబానా, అతని కొడుకు సమీర్ హతమార్చారు. కాళ్లు, చేతులు కట్టేసి చాకుతో గొంతు కోసి ఈ దారుణ ఘటనకు పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న బండ్లగూడ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా హతుడు మసీఉద్దీన్ అచేతన స్థితిలో పడి ఉన్నాడు. అయితే కుటుంబంలో కలహాలే హత్యకు దారి తీశాయనే దిశగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సవతి తల్లి వేధింపులతో పోలీసులను ఆశ్రయించిన బాలుడు.

వనపర్తి మార్చి-05:పసి బాలుడి వేదనను పోలీసు హృదయం ప్రేమతో ఆదరించి అక్కున చేర్చుకున్న ఘటన వనపర్తి జిల్లాలో వెలుగులోకి వచ్చింది.సవతి తల్లి పెట్టే బాధలను మనసు నుండి బయటికి రానీయకుండా భరిస్తున్న ఒక బాలుడిని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ చేరదీసి అతని భద్రతకు భరోసా కల్పించారు. వివరాలలోకి వెళితే....పెబ్బేరు మండలం సూగూరు గ్రామానికి చెందిన గొల్ల నరసింహ వనితల కుమారుడు (9).వనిత అనారోగ్యంతో రెండేళ్ల కిందట మరణించగా పెద్దల బలవంతంపై నరసింహాకు సమీప బంధువైన లక్ష్మిని రెండవ పెళ్ళి చేసుకున్నాడు.పెళ్ళైన కొత్తలో లక్ష్మి బాలున్ని బాగానే చూసుకునేది. కాలం గడిచేకొద్దీ కక్ష సాదింపుకు పాల్పడడం ప్రారంభించింది. చీటికీ మాటికి ఎవరూ లేని సమయంలో శారీరకంగా చిత్ర హింసలకు గుర్తుచేస్తూ నరకం చూపడం మొదలు పెట్టింది. ఏదో ఒక సాకుతో చిన్న విషయానికి చాటు మాటుగా తిట్టడం కొట్టడం అతని సవతి తల్లి శారీరకంగా హింస పెడుతూ అతనికి నిప్పులో కాల్చిన సలాకితో అతని తొడలు కాల్చినది ఆ విషయం ఆ బాలుడు తండ్రికి చెప్పినా ఆమె అరాచకానికి అడ్డుకట్ట వేయలేకపోయాడు.మంగళవారం రోజు బాలుడిని అకారణంగా ఆమె చితకబాధగా ఆ విషయాన్ని ఆ అబ్బాయి తన మేనమామ రామచంద్రయ్యకు ఫోన్ ద్వారా తెలిపాడు. రామచంద్రయ్య బాలుని తీసుకొని జిల్లా కేంద్రంలోని ఎస్పీ ఆఫీస్ కు చేరుకున్నాడు.ఆ అబ్బాయికి సంబంధించిన వృత్తాంతమంతా రామచంద్రయ్య ఎస్పీకి వివరించాడు.దెబ్బలను గుర్తుకు తెచ్చుకుని ఏడుస్తున్న బాలున్ని ఎస్పీ రావుల గిరిధర్ చేరదీసి అల్పాహారాన్ని అందజేసి ఊరడించారు. అనంతరం ఎస్పీ తనతో పాటు నివాసగృహానికి తీసుకెళ్లి భోజనం చేయించి కొద్దిసేపైనా తర్వాత అతని ద్వారా జరిగిన సమాచారమంతా రాబట్టారు. సవతి తల్లి పెడుతున్న బాధలను ,ఆ పసి హృదయం భరించిన తీరును విన్న ఎస్పీ చలించి పోయారు. వెంటనే ఆ అబ్బాయిని జిల్లా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జిల్లా అధికారి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ల ద్వారా బాలుడు ఎదుర్కొన్న మనోవేదనను, చిత్రహింసల వివరాలను సేకరించాలని వారిని కోరారు. వారి నివేదిక ఆధారంగా నిందితురాలిపై పెబ్బేరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చట్టపరంగా చర్యలు చర్యలు తీసుకున్నారు. బాలుడు భయం విడేవిధంగా చైతన్యం తీసుకువచ్చి జిల్లాలోని ఏదేని పాఠశాలలో చేర్పిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

# ప్రైవేట్ పనుల్లో బెజవాడ పోలీసులు

విజయవాడ, మార్చి 5, సోషల్ మీడియా, యూ ట్యూబర్లతో దోస్తీ చేస్తున్న బెజవాడ పోలీసులు ప్రజల వ్యక్తిగత గోప్యతతో చెలగాటాలు ఆడుతున్నారు. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ వ్యవహారంలో కొందరు పోలీసులే వీడియోలు రికార్డు చేసి ప్రైవేట్ వ్యక్తులకు షేర్ చేయడం చర్చనీయాంశంగా మారింది.విజయవాడలో ట్రాఫిక్ చలాన్లు, నిబంధనల ఉల్లంఘన, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపే వారిని పోలీసులు ప్రశ్నించే వీడియోలు ఇటీవల కాలంలో వైరల్ అవుతున్నాయి. మహిళలు, వృద్ధులు, ఉద్యోగుల వాహనాలను తనిఖీ చేసే సమయంలో నిబంధనల్ని ఉల్లంఘిస్తే వారికి జరిమానా విధిస్తున్నారు. జరిమానాలతో పాటు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారి వీడియోలను పోలీసులే సోషల్ మీడియాలో షేర్ చేయిస్తున్నారు.ట్రాఫిక్ నిబంధనల్ని కఠినంగా అమలు చేసే విషయంలో ఎవరికి అభ్యంతరం లేకున్నా, చలానాలను విధించే సమయంలో పోలీసులు బాడీ కెమెరాలతో రికార్డు చేస్తున్న వీడియోలు, మొబైల్ ఫోన్లలో రికార్డు చేసే వీడియోలను యూ ట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లతో షేర్ చేస్తున్నారు. ఈ తరహా వీడియోలు వైరల్ అవుతున్నాయి.తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని సైతం మీడియా ముందు ప్రవేశ పెట్టే సమయంలో ముసుగులు వేసి చూపించే పోలీసులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారి విషయంలో వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాపిక్ కూడళ్ల వద్ద సాధారణంగా విఐపి మూమెంట్ ఉంటే తప్ప పోలీసులు కనిపించరు. రద్దీ సమయాల్లో జనం ఎవరి బాధలు వారు పడాల్సిందే.ట్రాఫిక్ నియంత్రణ సంగతి ఎలా ఉన్నా నిత్యం ఉదయం, సాయంత్రం చలాన్లు రాయడం మాత్రం విధిగా చేపడుతున్నారు. ట్రాఫిక్ జరిమానాలు మార్చి 1 నుంచి గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో ప్రతి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో పోటాపోటీగా చలాన్లు విధిస్తున్నారు. మద్యం సేవించి పట్టుబడే వారిని న్యాయస్థానంలో హాజరు పరిస్తే రూ.10వేల జరిమానాతో పాటు జైలు శిక్షలు కూడా విధిస్తున్నారు.ట్రాఫిక్ చలాన్లు వసూలు చేసే క్రమంలో పోలీస్ అధికారులు ఉద్దేశ పూర్వకంగా వాటిని సొంత పబ్లిసిటీ కోసం వాడుకుంటున్నారు. కానిస్టేబుళ్లతో వీడియోలు తీయించుకుని సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లకు షేర్ చేస్తున్నారు. ఆ వీడియోల్లో హెల్మెట్ పెట్టుకోని యువతీ యువకుల్ని పోలీసులు మందలించడం, హెచ్చరించడం వంటివి కూడా ఉంటున్నాయి. జరిమానాలు చెల్లించక పోతే వాహనాలను సీజ్ చేస్తున్నారు.పోలీసులు రికార్డు చేసే వీడియోలను న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా మాత్రమే పరిగణించాల్సి ఉండగా పబ్లిసిటీ కోసం సోషల్ మీడియా వేదికలపై షేర్ చేయడం, వారి ముఖాలను అందరూ గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల అధికారిక హ్యాండిల్స్‌లో కూడా మహిళలు, మైనర్ల ఫోటోలను ముఖాలను గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల తనిఖీల సందర్భంగా యువతులు, విద్యార్థినులు, మహిళల్ని ప్రశ్నిస్తున్న ఫోటోలను బహిరంగ వేదికలపై షేర్ చేస్తున్నారు.విజయవాడ సీపీగా కాంతి రాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీలు ఉన్న సమయంలో సొంత పబ్లిసిటీ కోసం కొన్ని యూ ట్యూబ్ ఛానళ్లను ప్రోత్సహించారు. పర్సనల్ వీడియోలతో పబ్లిసిటీ చేయించడం, యువతలో గుర్తింపు తెచ్చుకోవడం కోసం వీటిని కొందరు అధికారులు ఉపయోగించే వారు. ఈ తరహా వీడియోలకు మిలియన్లలో వ్యూలు, వేలల్లో లైక్‌లు వస్తున్నాయి తద్వారా అయా ఛానళ్లకు భారీగా ఆదాయం కూడా లభిస్తోంది. ఏపీ పోలీస్ శాఖ వీడియోలను బయటి వారికి షేర్ చేయడం వాటితో ప్రైవేట్ వ్యక్తులకు ఆదాయం పొందడంపై అధికారులు కిమ్మనడం లేదు.పోలీస్ అధికారులు విధుల్లో ఉన్న సమయాల్లో క్లోజప్ షాట్స్, డ్రోన్ షాట్స్ తో సినిమాటిక్ ఎఫెక్ట్‌లతో పబ్లిసిటీ చేయించుకునే వారు. ఆ తర్వాత అధికారులు మారినా మిగిలిన వారు కూడా వాటిని అనుసరించడం మొదలు పెట్టారు. సీఐ స్థాయి అధికారుల నుంచి డీసీపీల వరకు ఇదే బాట పట్టారు. ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగమని తెలిసినా తీవ్ర నేరాలకు పాల్పడినట్టు సోషల్ మీడియాలో దోషులుగా చిత్రీకరిస్తున్నారు. ట్రాఫిక్ చలాన్ల విధించే సమయంలో రికార్డు చేస్తున్న వీడియోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై షేర్ చేయడంపై విజయవాడ ట్రాఫిక్ డీసీపీ వివరణ కోరినా స్పందించలేదు.

# సీనియర్లకు మొండి చేయి...

కాకినాడ, మార్చి 5,తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఆలోచన పూర్తిగా మారింది. పార్టీ పది కాలాల పాటు అధికారంలోకి రావాలంటే యువతకు అవకాశాలు ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు కనపడుతుంది. చట్ట సభల్లో ఏ పోస్టు ఖాళీ అయినప్పటికీ దానికి యువకులను ఎంపిక చేయాలన్న ఉద్దేశ్యంతో ఉంది. టీడీపీలో కష్టపడితే పదవులు వస్తాయన్న సంకేతాలను బలంగా పంపడానికే ఈ రకమైన నిర్ణయం పార్టీ హైకమాండ్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సీనియర్ నేతల సేవలను ఇప్పటి వరకూ వినియోగించుకున్నా వారిని పార్టీ సేవలకే ఉపయోగించుకోవాలని డిసైడ్ అయినట్లు సమాచారం. ఎలాంటి మొహమాటాలు లేకుండా సీనియర్లను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టాలని భావిస్తున్నారు. పార్టీ ఏర్పడి దాదాపు యాభై ఏళ్లు కావస్తుండటంతో సీనియర్ నేతలు టీడీపీలో పాతుకుపోయి ఉన్నారు. వారు మర్రిచెట్టులాగా తయారయ్యారన్న విమర్శలు క్యాడర్ నుంచి ఎదురవుతున్నాయి. వారు తప్పించి నియోజకవర్గాల్లోనూ, మరే పదవుల్లోనూ మరొకరికి స్థానం దక్కదన్న బలమైన అభిప్రాయం ద్వితీయ శ్రేణి నేతల్లో ఉంది. 2019 నుంచి 2024 వరకూ యువనేతలే ఎక్కువగా పార్టీకి కష్టపడ్డారు. చంద్రబాబు నిర్వహించిన అనేక సభలకు జనసమీకరణను కూడా వారే దగ్గరుండి చూశారు. సీనియర్ నేతలు పెద్దగా ఆ ఐదేళ్లు పార్టీని పట్టించుకోలేదన్న అభిప్రాయం బలంగా ఉంది. సీనియర్ నేతలకు ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాలు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ అందులోనూ యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని దాదాపుగా డిసైడ్ అయినట్లు తెలిసింది. ఇప్పటికే కొందరు తమంతట తామే రాజకీయాల నుంచి తప్పుకోగా, మరికొందరు పదవుల కోసం ప్రయత్నిస్తున్నారు. వారు పార్టీకి భారంగా మారారన్న వాదన బలంగా వినిపిస్తుంది. నియోజకవర్గాల్లో క్యాడర్ ను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, అలాగే తమ రాజకీయాల కోసం పార్టీని బలి చేస్తున్నారన్న వాదన మాత్రం అధినాయకత్వం జరిపిన సర్వేల్లోనూ వెల్లడి కావడంతో ఇక సీనియర్లకు చెక్ పెట్టాలన్న నిర్ణయానికి పార్టీ అధినాయకత్వం వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అవుతున్న నాలుగు ఎమ్మెల్సీ స్థానాలను కూడా యువకులకే ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. పార్టీ క్యాడర్ మనోభిప్రాయాలను గౌరవిస్తూ భవిష్యత్ నేతలను తయారు చేసుకునే పనిలో సైకిల్ పార్టీ ఉందనే చెప్పాలి. ఇక నారా లోకేశ్ యుగం కావడంతో యువతకే ప్రాధాన్యం ఇస్తారు. అందులో ఎలాంటి సందేహం లేదు. మంత్రి వర్గం కూర్పులోనే ఈ విషయం స్పష్టమయింది.

# 5 ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీగా ఆశావహులు

విజయవాడ, మార్చి 5, ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. గ్రాడ్యుయేట్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడం, ఎమ్మెల్యేల కోటా భర్తీకి నోటిఫికేషన్ వెలువడటంతో అభ్యర్థుల ఎంపిక కసరత్తు మొదలైంది. జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని అంగీకారం కుదిరింది.ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక నేపథ్యంలో సోమవారం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో నాగబాబు అభ్యర్థిత్వం ఖరారైనట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు సహా పలు అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపికపై ఇద్దరూ కొద్ది సేపు చర్చించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.ప్రస్తుతం ఎన్ని కలు జరగనున్న ఐదు స్థానాల్లో ఒక దానిని నాగబాబుకు ఇవ్వాలని నిర్ణయించారు. రాజ్యసభ ఎన్నికల సమయంలోనే నాగబాబు పేరు చర్చకు వచ్చింది. అంతకు ముందు టీటీడీ ఛైర్మన్ రేసులో కూడా వినిపించింది. రాజ్యసభ ఎన్నికల సమయంలో నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ప్రకటించారు. సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కూర్చుని ఉండగా.. పవన్ కళ్యాణ్ ఆయన వద్దకు వెళ్లారు.అసెంబ్లీలో కొద్ది నిమిషాలు మాట్లాడుకున్న తర్వాత ఇద్దరూ కలిసి సీఎం ఛాంబర్‌కు వెళ్లారు. బడ్జెట్లో వివిధ శాఖలకు కేటాయింపుల పై పవన్ కళ్యాణ్ తన అభిప్రాయాలు ముఖ్యమంత్రితో చెప్పినట్టు తెలుస్తోంది.మే నెల నుంచి ప్రారంభించే తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రహదా రుల పనులు చాలా వరకు చేశామని.. తాగునీటి సరఫరాపై ఎక్కువ దృష్టి పెట్టామని చంద్రబాబుకు పవన్ వివరించారు.ఉపాధి హామీ ద్వారా రాష్ట్రానికి ఎక్కువ నిధులు రాబట్టుకుని పెద్దఎత్తున పనులు చేయాల్సిన అవసరంపై చర్చించారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రికి పవన్ కళ్యాణ్ సూచించారు.ప్రస్తుతం మండలిలో జనసేన తరపున పిడుగు హరిప్రసాద్ ఎమ్మెల్సీగా ఉన్నారు. అదే సామాజిక వర్గానికి చెందిన నాగబాబును ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. మంత్రి వర్గంలో ప్రస్తుతం పవన్‌తో పాటు కందుల దుర్గేష్ ఉన్నారు. నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ఇప్పటికే ప్రకటించడంతో మూడో మంత్రి పదవి కూడా జనసేనలో అదే సామాజిక వర్గానికి దక్కనుంది.టీడీపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఆశిస్తున్న వారి జాబితా భారీగా ఉంది. ఎన్నికల పొత్తులో భాగంగా సీట్లు దక్కని వారంతా ఎమ్మెల్సీ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో మాజీ మంత్రులు కూడా ఉన్నారు. చంద్రబాబును, లోకేష్‌ను ప్రసన్నం చేసుకోడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అశోక్ బాబు వంటి నేతలుఎమ్మెల్సీ స్థానం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.ఎమ్మెల్సీ ఆశిస్తున్న పలువురు నేతలు అసెంబ్లీలో చక్కర్లు కొడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను ప్రసన్నం చేసుకోవాలని తహతహలాడుతున్నారు. ఖాళీ అవుతున్న ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ సోమవారం మొదలైంది.యనమల రామకృష్ణుడు, బీటీ నాయుడు, ఆశోక్బాబు, దువ్వారపు రామారావు, జంగా కృష్ణమూర్తిల పదవీకాలం ఈ నెల 28తో ముగుస్తోంది. శాసనసభలో కూటమి పార్టీలకే అన్ని స్థానాలను దక్కించుకునే అవకాశం ఉంది. ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో మిగిలిన నాలుగు స్థానాలపై పోటీ తీవ్రంగా ఉంది. బీజేపీ కూడా ఒక స్థానాన్ని కోరే అవకాశం ఉంది.మాజీ మంత్రులు కేఎస్ జవహర్, పీతల సుజాత, కేఈ ప్రభాకర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, విశాఖకు చెందిన మహ్మద్ నజీర్ అసెంబ్లీలో దర్శనం ఇచ్చారు. దువ్వారపు రామారావుకు మళ్లీ అవకాశం కల్పించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరాలని విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మె ల్యేలు రాత్రి సమావేశమై నిర్ణయించారు. శాసనసభ ఎన్నికల్లో పొత్తులతో పోటీ చేసే అవకాశం కోల్పోయిన వారంతా ఎమ్మెల్సీ కోసం పోటీపడుతున్నారు.

# గందరగోళంగా మారిన టౌన్ ప్లానింగ్

నెల్లూరు, మార్చి 5, ఏపీ మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పేది ఒకటి ఆ శాఖలో జరిగేది మరొకటి? ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణ రంగానికి ఊతం ఇచ్చేలా పలు నిర్ణయాలను .నారాయణ ప్రకటించారు. వంద గజాల్లోపు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మొదలుకుని అపార్ట్‌మెంట్ల నిర్మాణం వరకు భవన నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు పలు నిర్ణయాలను ప్రకటించారు. అయితే మంత్రి నారాయణ చెప్పిన వాటిలో ఇప్పటి వరకు ఒక్క నిర్ణయం కూడా అమలు కాలేదు. తాజాగా గత వారం హైకోర్టు ఆదేశాలతో? పురపాలక శాఖ భవన నిర్మాణ నిబంధనలు మరింత కఠినతరం చేసింది.ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల్ని ఉల్లంఘిస్తే మరింత కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పిన దానికి ఆ శాఖలో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలకు పొంతన కుదరడం లేదు. దీనిపై భవన నిర్మాణ రంగంలో ఉన్న వారి నుంచి బహిరంగంగానే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.తాజాగా భవన నిర్మాణదారుల కోసం అందుబాటులోకి వచ్చిన కొత్త సాఫ్ట్ వేర్ తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ ప్రకటించారు. 18 మీటర్ల ఎత్తు లోపు నిర్మించే భవనాలకు స్వీయ ధ్రువీకరణ పత్రం సరిపోతుందని టౌన్ ప్లానింగ్ అధికారులతో సంబంధం లేకుండా సరైన పత్రాలు సమర్పిస్తే ఆటోమెటిక్ గా అనుమతులు మంజూరవుతాయని ప్రకటించారు. ఈ విధానం 2019 నాటికి విజయవాడలో అమల్లో ఉంది. అయితే ఆటోమెటిక్ అనుమతుల జారీ విధానాన్ని పూణేకు సంబంధించిన కంపెనీకి అప్పట్లో అప్పగించారు. ప్రభుత్వం భవన నిర్మాణదారులకు ఎవరి జోక్యం లేకుండా ఈ అనుమతులు జారీ చేసే ఉద్దేశంతో సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెడితే అందులో కూడా టౌన్ ప్లానింగ్ వేలు పెట్టింది.కార్పొరేషన్ల పరిధిలో అధికారుల్ని ప్రసన్నం చేసుకుంటేనే ఆన్‌లైన్‌లో అనుమతి జారీ అయ్యేలా మార్పులు చేశారు. దీంతో గత ఐదేళ్లలో భవన నిర్మాణదారులు నరకం అనుభవించారు. అన్ని రకాల ఫీజులు చెల్లించినా కొర్రీలు వేసి ముప్ప తిప్పలు పెట్టేవారు. మునిసిపల్ కమిషనర్లను కూడా ఖాతరు చేయకుండా టౌన్ ప్లానింగ్ విభాగం వ్యవహరించేది.భవన నిర్మాణాలకు అనుమతుల విషయంలో స్వీయ ధృవీకరణ సరిపోతుందని గత నెలలో జీవో జారీ చేశారు. ఆ తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో మరికొన్ని నిబంధనలు విధించారు.తాజాగా రిజిస్టర్డ్ ఇంజినీర్లు,ఆర్కిటెక్ట్ లు యజమానుల సమక్షంలో ఆన్ లైన్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇస్తే సరిపోతుందని ప్రకటించారు. భవన నిర్మాణ అనుమతులను త్వరితగతిన జారీ చేసేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. ంఖఆఖఓ పోర్టల్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. అయితే భవన నిర్మాణాలను కొనసాగించడానికి కార్పొరేషన్ల పరిధిలో మార్టగేజ్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే తనఖా పెట్టిన భాగాలను జప్తు చేయడంతో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల కాదు.ఏపీలో 2019 నాటికి 250కు మించిన స్థలంలో 18మీటర్ల ఎత్తు వరకు భవనాలను నిర్మించుకనే వెసులుబాటు ఉంది. ఆ తర్వాత నిర్ణత బాండ్లను చెల్లించి ఆరో అంతస్తు నిర్మాణం చేపట్టేందుకు కూడా వైసీపీ ప్రభుత్వంలో అనుమతులిచ్చారు. దీంతో 250–30గజాల్లోపు స్థలాల్లో ఆరంతస్తుల వరకు నిర్మాణాలను చేపట్టే అవకాశం లభించింది.ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవనాల నిర్మాణాల అనుమతులకు స్వీయ ధృవీకరణ పత్రం ఇస్తే సరిపోతుందని ...టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు పర్మిషన్ వచ్చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది.భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్ టీపీలు,ఇంజినీర్లు లేదా ఆర్కిటెక్ట్ ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి స్వీయ ధృవీకరణ(అఫిడవిట్)ఇవ్వాల్సి ఉంటుందని మెలిక పెట్టారు. గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది.భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీ చేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందుబాటులోకి తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్ వేర్ ను ంఖఆఖఓ పోర్టల్ లోకి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం,సర్కులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు,1985 కు ముందు నిర్మించిన భవనాల పునర్మిణానానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా విజయవాడ, విశాఖపట్నం వంటి మునిసిపల్ కార్పొరేషన్లలో భవన నిర్మాణాలకు అనుమతులు, ప్లాన్ మంజూరు అంటే ముడుపులతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయింది. ఏ ఫీజు ఎంత వసూలు చేస్తారనే వివరాలు ఎవరికి దొరకవు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది చెప్పినంత చెల్లించాల్సిందే. నిర్ణీత ఫీజులు చెల్లించినా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ప్రసన్నం చేసుకోకపోతే వారిని ముప్ప తిప్పలు పెడతారు. ప్లాన్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే దగ్గర నుంచి దానికి ఫీజులు జనరేట్ అయ్యే వరకు రకరకాల కొర్రీలు వేసి వేధింపులకు గురి చేస్తుంటారు.ఇక ఖాళీ స్థలాలు కట్టే నిర్మాణాలకు ఆ స్థలం కొన్నప్పటి నుంచి వేకెంట్ ల్యాండ్ టాక్స్ వసూలు చేస్తారు. మధ్యలో ఎందరి చేతులు మారినా అది రికార్డుల్లో ఎక్కినప్పటి నుంచి నిర్మాణదారులు పన్ను చెల్లించాల్సి వస్తోంది.


# అరకు నుంచి అమెరికాకు కాఫీ




విశాఖపట్టణం, మార్చి 5,అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ లభించింది. ఇది ఆదివాసీ రైతులకు ఎంతో మేలు చేయనుంది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ ద్వారా అరకు కాఫీని యూరప్‌కు ఎగుమతి చేసే అవకాశం వచ్చింది. దీని ద్వారా దాదాపు 2600 మంది రైతులకు లబ్ధి జరగనుంది. అసలు అరకు కాఫీకి ఎందుకంత డిమాండ్.. ఆర్గానికి సర్టిఫికేషన్ అంటే ఏంటీ.. దాని వల్ల కలిగే లాభాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.అరకు కాఫీని గిరిజన రైతులు సేంద్రియ ఎరువులు ఉపయోగించి పండిస్తారు. రసాయన మందులు వాడకుండా సహజ పద్ధతుల్లో పండించడం వల్ల ఇది మరింత రుచికరంగా, ఆరోగ్యకరంగా ఉంటుంది. సముద్ర మట్టానికి 3600 అడుగుల ఎత్తులో సిల్వర్ ఓక్, మిరియాల చెట్ల మధ్య ఈ కాఫీ తోటలు పెరుగుతాయి. ఈ ప్రత్యేకమైన వాతావరణం వల్ల కాఫీ గింజలకు ఒక ప్రత్యేకమైన రుచి, సువాసన వస్తాయి. అరకులో అరబికా రకం కాఫీని పండిస్తారు. ఈ రకం కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉందిఅరకు కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. దీని రుచి, నాణ్యతకు గాను అనేక అవార్డులు కూడా లభించాయి. అరకు కాఫీ సాగులో గిరిజన రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి శ్రమ, నైపుణ్యం వల్లనే ఈ కాఫీ అంత రుచికరంగా ఉంటుంది. అరకు లోయలో మహిళలు పండిస్తున్న కాఫీలో చక్కటి పరిమళం ఉందని గతంలో ఐరాస ప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. కాఫీ సాగు ద్వారా ఆర్థిక సామాజిక విప్లవాన్ని తీసుకురావడంలో అరకు మహిళల కీలక పాత్ర ఉందని, అరకు మహిళలు భారత నారీశక్తికి చిహ్నాలని ఐకాస ప్రతినిధులు కొనియాడారు. అరకు కాఫీ ప్రత్యేకమైన సుగంధ లక్షణాలు కలిగి రుచికి ప్రసిద్ధి చెందింది.ఆర్గానిక్ సర్టిఫికేషన్ వల్ల అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గుర్తింపు లభిస్తుంది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ వల్ల యూరప్, అమెరికా వంటి దేశాలకు అరకు కాఫీని ఎగుమతి చేసే అవకాశం పెరుగుతుంది. ఆర్గానిక్ కాఫీకి సాధారణ కాఫీ కంటే ఎక్కువ ధర లభిస్తుంది. ఇది గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. ఆర్గానిక్ కాఫీలో రసాయన ఎరువులు, పురుగు మందులు ఉండవు. కాబట్టి ఇది ఆరోగ్యానికి మంచిది. ఆర్గానిక్ వ్యవసాయం పర్యావరణానికి హాని కలిగించదు. ఇది నేల, నీరు, గాలి కాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఆర్గానిక్ కాఫీ సాగు గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది.అరకు కాఫీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. కాఫీ తాగడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఇది జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఈ కాఫీ తాగడం వల్ల టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కాఫీ తాగడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కాఫీలో కెఫీన్ ఉంటుంది. ఇది శక్తిని పెంచుతుంది, అలసటను తగ్గిస్తుంది. అరకు కాఫీ ఆర్గానిక్ గుర్తింపు పొందడం వల్ల గిరిజన రైతులకు, పర్యావరణానికి, వినియోగదారులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

# జనసేనలో ఇమడలేకపోతున్న బాలినేని

ఒంగోలు, మార్చి 5, వైసీపీ మాజీ నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి రాజకీయంగా పునరాలోచనలో పడినట్లు తెలిసింది. 2024 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలయిన తర్వాత బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన అనూహ్యంగా జనసేన కండువా కప్పుకున్నారు. జనసేనలో చేరిన తర్వాత తనకు ప్రాధాన్యత దక్కుతుందని బాలినేని భావించారు. కానీ పెద్దగా ప్రయారిటీ దక్కకపోవడంపై ఇటీవల ఆయన తన సన్నిహితులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిసింది. ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్ష పదవి కూడా తాను సూచించిన వారికి ఇవ్వకపోడంపై బాలినేని శ్రీనివాసులు రెడ్డి కొంత మనస్థాపానికి గురయ్యారని చెబుతున్నారు. ఇటీవల వైసీపీకిచెందిన కార్పొరేటర్లను జనసేనలో చేర్చినప్పటికీ తనకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆయన మనస్తాపానికి గురయినట్లు తెలిసింది బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్, తర్వాత వైసీపీలో సుదీర్ఘకాలం పనిచేశారు. ఒంగోలు శాసనసభ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1999, 2004, 2009, 2012, 2019 ఎన్నికలలో ఆయన ఒంగోలు నియోజకవర్గం నుంచి గెలిచారు. అయితే టీడీపీ, జనసేన కూటమి ఏర్పాటుతో 2014 ఎన్నికల్లో దారుణ ఓటమి చవి చూశారు. కానీ ఈవీఎంలలో తేడా ఉందని ఆయన ఎన్నికల కమిషన్ ను, న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విషయంలో వైసీపీ పార్టీ నాయకత్వం తనకు అండగా నిలబడలేదన్న అసంతృప్తితో బాలినేని ఉన్నారు. మరొక వైపు



మంత్రివర్గ విస్తరణలో తనను తొలగించడంపై కూడా బాలినేని శ్రీనివాసులు రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి అసంతృప్తితో ఉన్న ఆయనకు తన బంధువు వైవీ సుబ్బారెడ్డి నుంచి కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. జగన్ వద్ద వైవీకి ప్రాధాన్యత పెరుగుతుండటంతో ఆయన తట్టుకోలేకపోయారు. సన్నిహితులు, కుటుంబ సభ్యులు వారిస్తున్నా ఆయన వినకుండా వైసీపీని వదిలి వెళ్లారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి దగ్గర బంధువు అయిన బాలినేని శ్రీనివాసులు రెడ్డి పార్టీని వీడటంతో జగన్ కు కొంత ఇబ్బంది అయినప్పటికీ ఆయనను ఆపే ప్రయత్నం మాత్రం చేయలేదు. ఆ కోపం మీద జనసేనలో చేరారు. కానీ జనసేనలోనూ తన మాట చెల్లుబాటు కాకపోవడం, జిల్లాలోనూ, ఒంగోలు నియోజకవర్గంలోనూ ఎవరూ తనను పట్టించుకోవడం లేదన్న బాధ బాలినేనిలో కనపడుతుంది.. అయితే జనసేన నుంచి బయటకు వచ్చేందుకు బాలినేని శ్రీనివాసులు రెడ్డి ఇప్పట్లో ప్రయత్నించకపోవచ్చు. ఇంకా ఎన్నికలకు సుదీర్ఘ సమయం ఉండటంతో తాను బయటకు వచ్చినా ప్రయోజనం ఉండదని ఆయనకు తెలుసు. అదే సమయంలో జనసేన లో ఉంటే కొంత సేఫ్ గా ఉంటానని బాలినేని భావిస్తుండవచ్చు. బాలినేని శ్రీనివాసులు రెడ్డిపై ఇప్పటికే ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కత్తులు నూరుతున్నారు. ఆయన నుంచి తనతో పాటు క్యాడర్ ను కాపాడుకోవాలంటే జనసేన లో కొన్నాళ్లు కాలం వెళ్లదీయక తప్పదని సన్నిహితుల వద్ద బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పినట్లు తెలిసింది.

# ఆవు పాలు, గేదె పాలు ఏవి మంచిదో తెలుసా...?



ఆవు పాలు మరియు గేదె పాలు రెండూ తమదైన ప్రత్యేకతలు కలిగి ఉంటాయి. ఏది మంచిది అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కొంచెం కష్టమే. వ్యక్తిగత అవసరాలు, ఆరోగ్య పరిస్థితి మరియు ఇష్టాలపై ఆధారపడి ఉంటుంది.ఆవు పాల లాభాలు:ఎముకలు మరియు దంతాల ఆరోగ్యానికి కాల్షియం చాలా ముఖ్యం. ఆవు పాలు కాల్షియం యొక్క అద్భుతమైన మూలం.శరీరం కణాల నిర్మాణానికి మరియు మరమ్మతుకు ప్రోటీన్ అవసరం. పాలు ప్రోటీన్ యొక్క మంచి మూలం.విటమిన్ డి, బి12, పొటాషియం వంటి అనేక ముఖ్యమైన విటమిన్లు మరియు ఖనిజాలు ఆవు పాలలో లభిస్తాయి.కొన్ని అధ్యయనాల ప్రకారం, పాలు తాగడం బరువు తగ్గడానికి సహాయపడుతుంది.పాలలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది." జున్ను పాలు తాగుతున్నారా..?"ఆవు పాల నష్టాలు:కొంతమందికి ల్యాక్టోస్ అనే చక్కెరను జీర్ణించుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. ఇలాంటి వారికి పాలు తాగడం వల్ల అజీర్తి, వాయువు, అతిసారం వంటి సమస్యలు వస్తాయి.పూర్తి కొవ్వు పాలలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది. ఇది హృదయ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది.కొన్ని పాలలో గర్భధారణ హార్మోన్లు ఉంటాయి. ఇవి కొన్ని ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చు.కొంతమందికి పాల ప్రోటీన్లకు అలర్జీ ఉంటుంది.గేదె పాల లాభాలు మరియు నష్టాలుగేదె పాలు పోషకాలతో నిండి ఉన్నాయి మరియు వేలాది సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా వినియోగించబడుతున్నాయి. అయితే, ఇతర పాల వలె, గేదె పాలకు కూడా కొన్ని లాభాలు మరియు నష్టాలు ఉన్నాయి.గేదె పాల లాభాలు:గేదె పాలలో కాల్షియం, ప్రోటీన్, విటమిన్లు మరియు ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యం, కండరాల అభివృద్ధి మరియు మొత్తం శరీర పనితీరుకు అవసరం. గేదె పాలలో ఉండే యాంటీబాడీలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి.గేదె పాలలోని ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి మరియు కడుపు సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి.గేదె పాలలోని ప్రోటీన్ శరీరాన్ని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది, ఇది బరువు నిర్వహణకు సహాయపడుతుంది.

# ఖాళీ కడుపుతో జీలకర్ర నీళ్లు తాగితే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు..

వి జీలకర్ర నీళ్లు అనేది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉండే సహజ వైద్య పద్ధతి. జీలకర్రలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల ఇది శరీరానికి మేలు చేస్తుంది. జీలకర్రని నీటిలో నానబెట్టడం ద్వారా వాటి పోషకాలు నీటిలో కలుస్తాయి, దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగడం ద్వారా మంచి ప్రయోజనాలను పొందవచ్చు. జీలకర్ర నీళ్లు తాగితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు: జీర్ణశక్తి మెరుగుదల: జీలకర్ర నీళ్లు



జీర్ణ వ్యవస్థకు సహాయపడుతుంది. ఇందులో ఉండే థైమోల్ అనే పదార్థం జీర్ణరసాల ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది, దీని వల్ల గ్యాస్ సమస్య, మలబద్ధకం మరియు మానసిక ఒత్తిడి తగ్గుతుంది. "నిత్యం యవ్వనంగా, అందంగా ఉండాలంటే ఇవి గుప్పెడు తినండి" బరువు తగ్గడం: జీలకర్ర నీళ్లు బరువు తగ్గడంలో సహాయపడే ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో తాగడం ద్వారా మెటాబాలిజం వేగంగా పనిచేస్తుంది, ఇది కొవ్వు కరుగుదలలో సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్ల సమృద్ధి: "పరగడుపున నిమ్మరసం తేనె తాగుతున్నారా? ఒక్కక్షణం ఆగండి!" జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు మరియు విటమిన్ ఇ ఉంటాయి, ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ని నాశనం చేస్తాయి. దీని వల్ల చర్మం కాంతివంతంగా, ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. ఇన్ఫెక్షన్ల నివారణ: జీలకర్రలో యాంటీ మైక్రోబియల్ , యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. దీన్ని రోజూ తాగడం ద్వారా శరీరంలో ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. ముఖ్యంగా గుండెకు, లివర్‌కు రక్షణ కల్పిస్తుంది. "చీర బిగుతుగా కట్టుకునే మహిళలకు షాకింగ్ న్యూస్!" ఇమ్యూనిటీ పెంపు: జీలకర్రలో ఐరన్, విటమిన్ సి ఉంటాయి, ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇది శరీరాన్ని ఇన్‌ఫెక్షన్ల నుండి కాపాడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. మొదలైన ఏపీ బడ్జెట్ సమావేశాలు.. ప్రాధాన్యతా రంగాలకు భారీ కేటాయింపులు । చర్మానికి , జుట్టుకు మేలు: జీలకర్రలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు చర్మం మరియు జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జీలకర్ర నీళ్లు తాగడం వల్ల చర్మం మెరుస్తూ ఆరోగ్యంగా మారుతుంది, జుట్టు ముడతలు రాకుండా ఆరోగ్యంగా పెరుగుతుంది. మధుమేహ నియంత్రణ: జీలకర్ర నీళ్లు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచడానికి సహాయపడుతుంది. ఇది మధుమేహంతో బాధపడుతున్న వారికి సహాయపడవచ్చు. జీలకర్ర నీళ్లను ఎలా తాగాలి: జీలకర్ర నీళ్లను తయారు చేయడం చాలా సులభం. 1 టీస్పూన్ జీలకర్రను 1 గ్లాసు నీటిలో రాత్రి నానబెట్టాలి. ఉదయం ఆ నీటిని వడకట్టి ఖాళీ కడుపుతో తాగాలి. ఈ విధంగా తాగడం వల్ల మీరు ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. జీలకర్ర నీళ్లను మితంగా మాత్రమే తీసుకోవాలి. రోజూ తాగడమే కాకుండా వైద్యుల సూచనలను కూడా అనుసరించాలి.

# కొబ్బరి నీళ్లలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే శరీరానికి ఏమవుతుందో తెలుసా?

కొబ్బరి నీరు ప్రకృతిద్వారా అందించిన ఒక శుద్ధమైన, ఆరోగ్యకరమైన పానీయం. ఇది సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్స్, విటమిన్లు, ఖనిజాలు కలిగిన పానీయం కావడంతో ఆరోగ్యానికి చాలా మంచిది. కొబ్బరి నీరులో కొద్దిగా ఉప్పు కలిపి తాగడం కూడా ఆరోగ్యపరంగా కొన్ని ప్రయోజనాలు కలిగి ఉంటుంది, కానీ కొన్నిసార్లు దానికి ప్రతికూల ఫలితాలు కూడా కలగవచ్చు. ప్రయోజనాలు: హైడ్రేషన్: కొబ్బరి నీరులో సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్స్ ఉండటం వల్ల ఇది శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం వల్ల శరీరం మరింత సమర్థవంతంగా నీటిని గ్రహిస్తుంది. ఇది




వ్యాయామం తరువాత లేదా గరిష్ట వేడిలో బయట ఉన్నప్పుడు శరీరంలో తేమను తిరిగి పొందడంలో సహాయపడుతుంది. "ఖాళీ కడుపుతో కరివేపాకు తింటే కలిగే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు ఇవే!" ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్: కొబ్బరి నీరులో ఉన్న పొటాషియం, సోడియం వంటి ఎలక్ట్రోలైట్స్ శరీరంలో సోడియం స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. కొద్దిగా ఉప్పు కలపడం ద్వారా సోడియం స్థాయిని మరింత పెంచుకోవడం సాధ్యమవుతుంది, ఇది నీటిని తక్కువగా విడిచిపెట్టేలా చేయడంలో సహకరిస్తుంది. ఎసిడిటీ తగ్గించడం: "అందం కోసం ముల్తానీ మట్టిని ముఖానికి అప్లై చేస్తున్నారా? ఒక్కసారి ఈ విషయాలు తెలుసుకోండి." కొబ్బరి నీరు త్రాగడం వల్ల ఆమ్లాన్ని తగ్గిస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం వల్ల ఇది మరింత సమర్థవంతంగా పని చేస్తుంది. ఇది గ్యాస్ట్రిక్ సమస్యలను తగ్గించడంలో సహకరిస్తుంది. జీర్ణ ప్రక్రియకు సహాయం: కొబ్బరి నీరు సహజంగా తేలికగా ఉండి జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం ద్వారా జీర్ణక్రియను పెంపొందించుకోవచ్చు, ఇది ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది.

# ప్లాస్టిక్ టిఫిన్ బాక్స్‌ల్లో ఫుడ్ తింటున్నారా? ఎంత డేంజరో తెలుసా?


ప్లాస్టిక్ టిఫిన్ బాక్స్‌లలో ఆహారం ఉంచి తినడం ఆరోగ్యంపై కొన్ని ప్రభావాలను చూపుతుందనే ఆందోళనలు ఉన్నాయి. ఆధునిక జీవనశైలిలో ఈ బాక్స్‌లు సులభంగా అందుబాటులో ఉండడంతో, పిల్లల నుండి పెద్దల వరకు ప్రతిరోజూ వీటిని వాడుతున్నారు. అయితే, ప్లాస్టిక్ టిఫిన్ బాక్స్‌లలో ఉన్న రసాయనాలు, వేడి చేయడం వంటివి ఆరోగ్యానికి కీడు కలిగించే అవకాశముంది. ముఖ్యంగా ప్లాస్టిక్ రసాయనాలు శరీరంలో చేరి, కొన్ని సందర్భాలలో క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణం కావచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్లాస్టిక్‌లో ఉండే హానికర రసాయనాలు: బిస్ఫెనాల్-ఏ (ఃఖం): కొన్ని ప్లాస్టిక్‌లు బిస్ఫెనాల్-ఏ (ఃఖం) అనే రసాయనాన్ని కలిగి ఉంటాయి, ఇది శరీరంలోకి ప్రవేశించి హార్మోన్లను అసమతుల్యంగా మార్చే ప్రమాదం ఉంది. ఃఖం వంటి రసాయనాలు ఎండోక్రైన్ వ్యవస్థకు హానికరంగా ఉంటాయి. దీర్ఘకాలంలో ఇది కేన్సర్‌కు కూడా కారణం కావచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. "చీర బిగుతుగా కట్టుకునే మహిళలకు షాకింగ్ న్యూస్!" ఫ్తాలేట్స్: ఫ్తాలేట్స్ అనే రసాయనాలు కూడా హార్మోన్లలో మార్పులు కలిగించవచ్చు. గుండె, పేగు, కేన్సర్ వంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. వేడి చేయడం వల్ల కలిగే సమస్యలు: ప్లాస్టిక్ టిఫిన్ బాక్స్‌లను వంట గదిలో వాడడం, లేదా మైక్రోవేవ్‌లో వేడి చేయడం వల్ల ప్లాస్టిక్‌లోని హానికర రసాయనాలు ఆహారంలోకి విడుదల కావచ్చు. ఈ రసాయనాలు శరీరంలోకి వెళ్లి తక్షణం సమస్యలు ఇవ్వకపోయినా, దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలను కలిగించే అవకాశం ఉంది. సున్నితమైన ప్లాస్టిక్: "ప్రమాదంలో మనిషి జీవితం: రోజుకు మనం ఎంత ప్లాస్టిక్ మింగుతున్నామో తెలుసా..? " ప్రథమంగా, ప్రతి ప్లాస్టిక్ ఒకేలా తయారు కాలేదు. నాణ్యమైన, ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌లలో ఃఖం-ఫ్రీ టాగ్ ఉంటే, వీటిని ఉపయోగించడం మరింత సురక్షితం. కానీ, తక్కువ నాణ్యత గల ప్లాస్టిక్‌లు ఎక్కువగా వేడి చేయడం వల్ల కేన్సర్ ముప్పును పెంచుతాయని భావిస్తారు.



# అమ్మో.. ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారం తింటున్నారా?



ప్రెషర్ కుక్కర్‌లో వంట చేయడం, భారతీయ వంటగదుల్లో చాలా సాధారణం. ఇది తక్కువ సమయంలో ఆహారాన్ని రుచికరంగా, సమర్థవంతంగా తయారు చేయడంలో సహాయపడుతుంది. అయితే, ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారం ఆరోగ్యానికి ఎంతవరకు మంచిదో అనే ప్రశ్నకు సంబంధించి కొన్ని ఆరోగ్యపరమైన పాయింట్లు మరియు చర్చలు ఉన్నాయి. ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారంలో ప్రయోజనాలు: పోషకాల ప్రిజర్వేషన్: ప్రెషర్ కుక్కర్‌తో ఆహారాన్ని త్వరగా వండుతారు కాబట్టి ఇందులోని పోషకాలు బాగా కాపాడబడతాయి. సాధారణ వంటల్లో ఎక్కువ కాలం పైనుంచి తక్కువ ఉష్ణోగ్రతలో వండడం వల్ల అనేక పోషకాలు నశించే అవకాశం ఉంది. కానీ ప్రెషర్ కుక్కర్‌లో వండినప్పుడు తక్కువ సమయంలో ఆహారం ఉడికిపోవడంతో పోషకాలు మరింత ప్రిజర్వ్ అవుతాయి. "జినీఎజీబినీ ఔవలిబ: మీడియాకు గట్టిగా ఇచ్చిపడేసిన జొమాటో అఖా.. ఫ్యూచర్ డేటెట్ ఫుడ్‌పై క్లారిటీ" ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు: వేడి, గాలి తగలకుండా వేగంగా ఉడికించడం వల్ల విటమిన్ సి, బి విటమిన్లు, మరియు ఫైబర్ పోకుండానే ఉంటాయి. సలాడ్లు, కూరగాయలు, మరియు కాయధాన్యాలు ప్రెషర్ కుక్కర్‌లో వండినప్పుడు వాటిలోని ఖనిజాలు ఎక్కువగా కాపాడబడతాయి. సమయం మరియు ఇంధన ఆదా: "ఊఎటవతీజీఎజీట: వామ్మో బొద్దింకలు.. రెస్టారెంట్లలో దారుణ పరిస్థితులు..!" ప్రెషర్ కుక్కర్ తక్కువ సమయంలోనే ఎక్కువ ఆహారాన్ని వండే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇది గ్యాస్ లేదా విద్యుత్ పొదుపుకు కారణం అవుతుంది. ఈ విధానం వేగంగా కాయధాన్యాలు, మాంసాలు, కూరలు, వంటకాలు వండుకోవడానికి చాలా సులభమైనది. చెడు బాక్టీరియా నివారణ: ప్రెషర్ కుక్కర్ ఎక్కువ ఉష్ణోగ్రతలో వంట చేయడం వల్ల ఆహారంలో ఉండే హానికరమైన బాక్టీరియాను తక్షణం నాశనం చేస్తుంది. ఇలా చేయడం ద్వారా ఆహారం సురక్షితంగా ఉంటుందని భావించవచ్చు. "ఉదయాన్నే నానబెట్టిన గింజలు ఎందుకు తినాలి? శరీరంలో కలిగే మార్పులు ఏమిటి?" ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారంలో నష్టాలు: పోషక లోపం: ప్రెషర్ కుక్కర్ ఎక్కువ ఉష్ణోగ్రతను ఉపయోగించే కారణంగా కొన్నిసార్లు కొంతమేరకు పోషకాలు నశించే అవకాశం ఉంది. ముఖ్యంగా విటమిన్ సి, బి విటమిన్లు వంటివి అధిక వేడికి సున్నితంగా ఉండటంతో అవి కొంత పోవచ్చు. కార్బనేట్ ఉత్పత్తి: కొన్ని పరిశోధనల ప్రకారం, ప్రెషర్ కుక్కర్‌లో అధిక వేడిలో వండిన ఆహారంలో కార్బనేట్ అనేది ఏర్పడవచ్చు. ఈ కార్బనేట్స్ ఎక్కువగా ఉండడం ఆరోగ్యానికి హానికరం కావచ్చని అంటున్నారు, కానీ దీనిపై ఇంకా పూర్తి స్థాయి పరిశోధన అవసరం. సహజ రుచులు నశించడం: ంటలవతీబితిబవఎవనిబి కొన్ని కూరగాయలు, కాయధాన్యాలు ఉడికినపుడు వాటి సహజ రుచులు ప్రెషర్ కుక్కర్‌లో నశించవచ్చు. ఈ రసాలు పోవడం వల్ల ఆహారం యొక్క సహజ రుచులు కొంచెం తగ్గిపోవచ్చు. అధిక వేడి, ఒత్తిడితో ఆహారం పాచిపోవడం: అధిక వేడి మరియు ఒత్తిడి కారణంగా ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారం కొన్నిసార్లు పాచిపోవడం లేదా కఠినంగా మారిపోవచ్చు. ఉదాహరణకు, కూరగాయలు లేదా కాయధాన్యాలు ఎక్కువగా వండితే దాని ఫైబర్ కఠినతరం కావచ్చు, ఇది జీర్ణం కావడం కష్టమవుతుంది. అధిక ఒత్తిడి వల్ల పోషకాల నష్టం: కొన్ని సున్నితమైన పోషకాలు అధిక ఒత్తిడిలో ప్రిజర్వ్ చేయడం కష్టమైన పని, ఎందుకంటే అవి సులభంగా విరుగుడతాయి. ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారం మితంగా వాడితే ఆరోగ్యానికి మంచిదేనని చెప్పొచ్చు. అయితే, సున్నితమైన పోషకాలు, ప్రత్యేకంగా కొందరు ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం, మరికొన్ని వంటకాలను సన్నని వేడి మీద వండడం ఉత్తమం.




# శ్రీకాంత్ ఒదెలా.. బ్లాస్ట్ చేసేలా ఉన్నాడు



తెలుగు సినిమాకు కొత్త ట్రెండ్ తీసుకురావడంలో కొందరు దర్శకులు ఆలోచిస్తున్న విధానం హాట్ టాపిక్ గా మారుతుంది . అలా తన టేకింగ్‌తో, కథనంతో అందరినీ షాక్‌కు గురి చేస్తున్న దర్శకుడు శ్రీకాంత్ ఒదెలా. సుకుమార్ రంగస్థలం సినిమాకు సహాయక దర్శకుడిగా పని చేసిన మనోడు గురువు కంటే వైల్డ్ గా దూసుకుపోతున్న విధానం ఆశ్చర్యంగా ఉంది. తొలి సినిమాతోనే బాక్సాఫీస్‌ని దుమ్ములేపి, అటు సినీ వర్గాల్లోనూ, ఇటు ప్రేక్షకుల్లోనూ నమ్మకం సాధించాడు. దసరా కంటే ది ప్యారడైజ్ సినిమా అంతకుమించి అనేలా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. కేవలం ఒక్క సినిమాతోను యువ దర్శకుడిలో ఉన్న కాన్ఫిడెన్స్ టాలీవుడ్‌ని అబ్బురపరుస్తోంది. ఇక రెండో సినిమా ఫస్ట్ అప్డేట్ తోనే ఇండస్ట్రీలో అలజడి క్రియేట్ చేశాడు. ఒక మాస్ యాక్షన్ సినిమాను ఎలా నడిపించాలో, అందులోని నేటివిటీని ఎలాంటి కాంప్రమైజ్ లేకుండా ఎలా చూపించాలో తెలిసిన దర్శకుల జాబితాలోకి రెండో సినిమాతోనే చేరిపోయాడని అనిపిస్తోంది. సాధారణంగా మాస్ హీరోలను భారీగా ఎలివేట్ చేయడంలో చాలా మంది దర్శకులు రెగ్యులర్ ట్రెండ్ లో వెళ్లిపోతారు. కానీ శ్రీకాంత్ మాత్రం హీరోలను సింపుల్‌గా మాస్ క్యారెక్టర్‌లా చూపించకూడదని, హై వోల్టేజ్ రా యాక్షన్‌తో, ఫుల్ ఇంటెన్సిటీతో, విభిన్నమైన శైలిలో చూపించాలని నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది. 'దసరా' లో నల్లని మట్టితో హీరో నానిని 'ధరణి' క్యారెక్టర్ లో చూపించిన విధానం ఎంత పవర్ఫుల్‌గా నిలిచిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆ మూవీ ఇచ్చిన కిక్‌తో నేడు ది ప్యారడైజ్ ను హై లెవెల్ లో సెట్ చేస్తున్నాడు. ఇక అతని మొదటి గ్లింప్స్ తోనే నేషనల్ వైడ్‌గా హైలైట్ అవుతున్నాడు. కేవలం టీజర్‌కే ఇంత రియాక్షన్ వస్తే, ఫుల్ మూవీ ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. 'ది ప్యారడైజ్' టైటిల్‌కి పూర్తి విరుద్ధంగా నాని క్యారెక్టర్ డిజైన్ చేసిన తీరు చూస్తే, అతని కథల ఎంపిక ఎంత విభిన్నంగా ఉంటుందో అర్థమవుతుంది. టాలీవుడ్‌లో యాక్షన్ చిత్రాలను రూపొందించే దర్శకులే చాలా మంది ఉన్నా, ఓ మాస్ క్యారెక్టర్‌ను రా, ఇంటెన్స్, ఎమోషనల్ అటాచ్‌మెంట్‌తో ప్రజెంట్ చేయగల నైపుణ్యం చాలా తక్కువ మందికి ఉంది. అందులో శ్రీకాంత్ ఒదెలా ఇప్పుడు తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్క్ ఏర్పరచుకున్నాడు. సినిమా రెండో చిత్రం అనిపించకుండా అతని మేకింగ్, విజువల్స్, నేటివిటీ హోల్డింగ్ ఉండటంతో శ్రీకాంత్‌పై ఒక్కసారిగా అంచనాలు పెరిగాయి. ఇప్పటికే చిరంజీవి కోసం ఒక మాస్ యాక్షన్ స్క్రిప్ట్ సిద్ధం చేసిన ఈ దర్శకుడు, ఆ సినిమాతో టాలీవుడ్‌లో తన స్థాయిని మరింత పెంచుకునే అవకాశాలున్నాయి. ఇండస్ట్రీలో ఉన్న సీనియర్ డైరెక్టర్లే ఈ తరహా ఇంటెన్సిటీతో మాస్ హీరోలను ప్రెజెంట్ చేయడంలో భయపడతారు. కానీ ఈ కుర్రాడికి మాత్రం అలాంటి బెరుకు లేదు. కథ బలంగా ఉంటే ఎలాంటి హీరో అయినా నమ్మొచ్చని తన టేకింగ్‌తో నిరూపిస్తున్నాడు. ఇదంతా చూస్తుంటే.. తెలుగు ఇండస్ట్రీలో మరో మాస్ కమర్షియల్ బ్లాక్‌బస్టర్ దర్శకుడు అవ్వడానికి శ్రీకాంత్ ఒదెలా సిద్ధమయ్యాడని చెప్పొచ్చు.

# అట్లీ సలహాతోనే బన్నీస్పెషల్ ట్రైనింగా?

: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్‌కి సన్నాహాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది నెలాఖరుకల్లా క్లారిటీ వస్తుంది. అయితే అట్లీ మాత్రం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బన్నీకి జోడీగా జాన్వీకపూర్ ని హీరోయిన్ గా తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే స్టోరీ డిమాండ్ మేరకు మరికొంత మంది భామల్ని కూడా ఎంపిక చేస్తున్నాడు. దీనిలో భాగంగా ఏకంగా విదేశాలకే వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. సినిమాలో మొత్తం ఐదుగురు హీరోయిన్లు ఉంటారు. ఒక భామగా జాన్వీ కపూర్ కాగా, మిగతా నలుగురు భామలు విదేశీ బ్యూటీలే అంటున్నారు. అమెరికన్, కొరియన్ భామల్ని ఎంపిక చేస్తున్నారుట. ఈ ప్రాజెక్ట్ ని పాన్ వరల్డ్ కనెక్ట్ చేసే యోచనలో భాగంగా విదేశీ బ్యూటీలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. ఇటీవలే బన్నీ విదేశాల్లో ట్రైనింగ్ కూడా ముగించుకుని హైదరాబాద్ కి తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైనింగ్ అట్లీ సినిమాకా? త్రివిక్రమ్ సినిమాకా? అన్న సందిగ్ధత కూడా వీడుతుంది. అట్లీ సినిమా కోసమే బన్నీ విదేశాలకు వెళ్లినట్లు..అట్లీనే ఓ స్పెషల్ ట్రైనర్ల వద్దకు పంపించినట్లు లీకులందు తున్నాయి. బన్నీ ఇమేజ్



ని దృష్టిలో పెట్టుకుని ఇంకాస్త డోస్ ఎక్కువగానే అట్లీ హై ఆక్టేన్ స్క్రిప్ట్ రాసాడుట. బన్నీ జిమ్నాస్టిక్, మార్షల్ ఆర్ట్స్ తెలిసిన నటుడు. ఈ నేపథ్యంలో బన్నీ లో ఆ యాంగిల్ ని కూడా స్క్రిప్ట్ లో ఇన్ బిల్ట్ చేసాడుట. దానికి సంబంధించే విదేశాల్లో ఓ స్పెషల్ ట్రైనర్ వద్ద 30 రోజులు ట్రైనింగ్ ఇప్పించినట్లు తెలుస్తుంది. మరి ఇందులో వాస్తవం ఏంటో తెలియాలి.


# పాట కోసం హీరోలిద్దరి మధ్య బిగ్ వార్! '



'వార్ 2' చిత్రీకరణలో భాగంగా హృతిక్ రోషన్- యంగ్ టైగర్ ఎన్టీఆర్ మధ్య ఓ పాట చిత్రీకరణ జరుగుతోన్న సంగతి తెలిసిందే. ముంబై యశ్ రాజ్ స్టూడియోస్ లో ఓ భారీ సెట్ నిర్మించి చిత్రీకరణ నిర్వహిస్తున్నారు. పాటలో ఎన్టీఆర్-హృతిక్ పోటాపోటీగా డాన్సు చేస్తున్నారు. ఇద్దరి మధ్య ఈ పాట ఓ తగ్గాఫ్ వార్ లాగే ఉంటుందని సమాచారం. తాజాగా ఈ పాటకు సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ అప్ డేట్ అందింది. ఈ పాటలో మొత్తం 500 మంది డాన్సర్లు పాల్గొంటున్నారుట. వాళ్లందరితో తారక్...హృతిక్ స్టెప్ అందుకుంటున్నారు. బాస్కో మార్టిన్ ఈ పాటకు కొరియోగ్రఫ వహిస్తున్నారు. సంగీత దర్శకుడు ప్రీతమ్ ఈ పాటకు అద్భుతంగా కంపోజ్ చేసినట్లు సమాచారం. ఈ పాట సినిమాకే ప్రత్యేక ఆకర్షణగ నిలుస్తుందని అంటు న్నారు. దాదాపు ఆరు రోజుల పాటు ఈ పాట చిత్రీకరణ జరుగుతుందని చెబుతున్నారు. అలాగే పాట కోసం భారీగానూ ఖర్చు అవుతున్నట్లు సమాచారం. మరి ఈ పాట ఆస్కార్ అవార్డు గెలుచు కున్న 'నాటు నాటు' పాటకు పోటీగా ఉంటుందా? అంతకు మించి ఉంటుందా? అన్నది చూడాలి. ఎన్టీఆర్ -హృతిక్ కాంబినేషన్ లో పాట అనగానే నాటు నాటు పాటనే తలపించారు. ఇద్దరు పోటీ పోటీగా డాన్సు చేయడం ఖాయమని అప్పుడే డిసైడ్ అయింది. డాన్సులో ఎన్టీఆర్ మాస్టర్. టాలీవుడ్ లో మంచి డాన్సర్ గా తారక్ కి పేరుంది. అలాగే బాలీవుడ్ లో టాప్ డాన్సర్ ఎవరు? అంటే హృతిక్ పేరు చెబుతారంతా. అలాంటి ఇద్దరు డాన్సింగ్ కింగ్స్ మధ్య పోటీ అంటే ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. నాటు నాటు ను మించే ఉంటుందని భావిస్తున్నారంతా. 'వార్ 2' షూటింగ్ కూడా క్లైమాక్స్ కు చేరుకుంది. ఈనెలలో తారక్ పోర్షన్ మొత్తం ముగించుకుని ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ లో జాయిన్ అవుతాడు.

# లైలా ఓటీటీలో అయినా నచ్చుతుందా?

విశ్వక్ సేన్ కెరీర్ లో మొదటిసారి మహిళగా నటించాడు. అతడు లేడీ గెటప్ లో నటించిన 'లైలా' ఇటీవలే విడుదలై ఘోర ఫలితాన్ని అందుకుంది. ఈ సినిమా అసభ్యకర సన్నివేశాలు, భాష కారణంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అమ్మాయిగా విశ్వక్ సేన్ వేషధారణ బావున్నా కానీ, భాష భావజాలం తీవ్రమైన విమర్శలకు తెరతీసింది. తెలుగు చిత్రసీమలో చెత్త సినిమాల్లో ఇదొకటి అని విమర్శకులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. లైలాపై వచ్చిన విమర్శలతో షాక్ అయిన విశ్వక్ సేన్ తన అభిమానులకు క్షమాపణలు చెబుతూ సోషల్ మీడియాలో నోట్‌ను విడుదల చేశారు. అతడు ఫ్యాన్స్, తెలుగు ప్రజలకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడం ద్వారా డ్యామేజ్ కంట్రోల్ కి ప్రయత్నించాడు. ఈ సినిమా మార్చి 7 నుంచి ఓటీటీలో అందుబాటులోకి రానుంది. లైలా చిత్రం ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. థియేట్రికల్ గా రిలీజైన మూడు వారాల్లోనే ఈ సినిమా ఓటీటీలోకొస్తోంది. విశ్వక్ సేన్ కెరీర్ లో కొన్ని తప్పటడుగులు వేసాడు. సక్సెస్ ఉంది.. ప్రతిభ ఉంది. కానీ దానిని నిలబెట్టుకోవడంలో విఫలమవుతున్నాడు. ఈసారి అలా కాకుండా అభిమానులను నిరాశపరచని క్వాలిటీ ఉన్న సినిమాలో నటించాల్సి ఉంటుంది. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో ఆకాంక్ష శర్మ కథానాయికగా నటించింది. షైన్ స్క్రీన్స్‌కు చెందిన సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. లియోన్ జేమ్స్ సంగీతం సమకూర్చారు. లైలా ఓటీటీలో వస్తోంది... కనీసం ఈ స్మార్ట్ డిజిటల్ ఫార్మాట్‌లో అయినా ఆదరణ దక్కించుకుంటుందేమో చూడాలి.



# మరోసారి సామ్ హిట్ కాంబినేషన్ టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ సమంత,

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ సమంత, టాలెంటెడ్ డైరెక్టర్ నందినీ రెడ్డి మధ్య ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా వీరిద్దరి కలయికలో వచ్చిన ఓ బేబీ ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికీ తెలుసు. ఇప్పుడు మళ్లీ ఈ కాంబినేషన్ రిపీట్ కానుందా అనే సందేహం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇందుకు కారణం.. సమంత తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నందినీ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ చేసిన కామెంట్స్. "జన్మదిన శుభాకాంక్షలు నందినీ రెడ్డి. అందరి చూపు ఇప్పుడు నీ మీదే. ఇది గొప్ప ఏడాది అవుతుంది. ముందుకు సాగుదాం" అంటూ సమంత పోస్ట్ చేయడం ఆసక్తికరంగా మారింది. దీనికి నందినీ రెడ్డి కూడా " మళ్లీ మొదలెట్టే క్షణం కోసం ఎదురుచూస్తున్నా. ముందుకు సాగుదాం" అని సమాధానం ఇచ్చారు. ఇప్పుడు వీరి మాటల్లో ఓ కొత్త సినిమా సంకేతం దాగుందా అని సినీ ప్రేమికులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. సమంత కమర్షియల్ హీరోయిన్ గా సినిమాలు తగ్గించి ప్రస్తుతం కంటెంట్ ఉన్న లేడి ఓరియెంటెడ్ సినిమాలు చేస్తోంది. నెవ్వర్ బిఫోర్ అనేలా ప్రయోగాత్మకమైన పాత్రలను ఎంచుకుంటోంది. ప్రస్తుతం ఆమె మా ఇంటి బంగారం అనే కుటుంబ సినిమాతో పాటు హిందీలో ఒక వెబ్ సిరీస్‌లోనూ నటిస్తోంది. అయితే, నందినీ రెడ్డి దర్శకత్వంలో మరో సినిమా ఒప్పుకోవడం వల్ల సమంత మళ్లీ ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించనుందా అనే ఉత్కంఠ నెలకొంది. నందినీ రెడ్డి నాని హీరోగా చేసిన అలా మొదలైంది సినిమాతో దర్శకురాలిగా పరిచయమైన విషయం తెలిసిందే. ఆ సినిమా సక్సెస్ కావడంతో ఆ తరువాత జబర్దస్త్ అనే మరో సినిమా చేసింది. ఇక ఇందులో సిద్దార్థ్ హీరోగా నటించగా సమంత హీరోయిన్ గా నగించింది. ఇక ఆ తరువాత కళ్యాణ వైభోగమే, ఓ బేబీ సినిమాలు చేసింది. చివరగా గత ఏడాది నందిని డైరెక్షన్ లో అన్ని మంచి శకునములే.. అనే సినిమా వచ్చింది. ఇక నెక్స్ట్ సమంత ప్రధాన పాత్రలో ఓ కొత్త కథ సిద్ధం చేస్తోందని, అది పూర్తిగా భిన్నమైన కథాంశంగా ఉండబోతుందనే ప్రచారం జరుగుతోంది. ఓ బేబీ తరహాలో కాకుండా, మరింత విభిన్నమైన కథను నందినీ రెడ్డి సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ వార్తలన్నీ నిజమా లేక స్నేహితుల మధ్య జరిగే రెగ్యులర్ సంభాషణ మాత్రమేనా అన్నది అధికారిక ప్రకటన వచ్చేంత వరకు తెలియదు.



# మంథనిలో ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

### -భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

మంథని మార్చి 5, )ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం మంథనిలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సెంటర్ లో 184 మంది విద్యార్థులకు గాను18 మంది గైహాజరు కాగా 166 మంది పరీక్షలను రాశారు. అదే విధంగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సెంటర్ లో 153 మందికి గాను 6 గైహాజరు కాగా 147 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఈ పరీక్షలను నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను మంథని సీఐ రాజు, ఎస్ఐ రమేష్ లు పరిశీలించారు.

# అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా గుండాల తహసీల్దార్ కార్యాలయం

### చనిపోయిన వ్యక్తుల భూములే టార్గెట్.

యాదాద్రి మార్చి 5, (న్యూస్ పల్స్)గుండాల తహసీల్దార్ కార్యాలయం అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారింది. గుండాల మండలంలోని నూనెగూడెం గ్రామానికి చెందిన కప్పరి రామకిష్టయ్య 2017లో మరణించాడు. ఆయన పేరున గుండాల రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 450లో 0.08 గుంటలు, 451లో 0.15, 452 లలో 0.08 గుంటల భూమి ఉన్నది. రామకిష్టయ్యకు సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఇందిరమ్మ వారసులుగా ఉన్నారు. సదరు భూమిని వారసులకు తెలియకుండా.. నూనెగూడెం గ్రామానికి చెందిన "మలిపెద్ది రజిత" తానే వారసురాలినని.. 0.31గుంటల భూమిని 2022లో రెవెన్యూ అధికారులతో కలిసి ఫౌతి విరాసత్ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రామకిష్టయ్య వారసులు.. తహసీల్దార్ కార్యాలయంలో 2023 జనవరి 29న రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు పట్టించుకోలేదు. ఫౌతి జరిగినట్లు తమకు నిజ ప్రతులు ఇవ్వాలని కోరినా ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కప్పరి రామకిష్టయ్య నుంచి మలిపెద్ది రజితకు ఫౌతి జరిగిన తర్వాత ఆమె నుంచి మలిపెద్ది సంజీవరెడ్డికి 0.08 గుంటలు, గందె నర్సయ్యకు 0.08 గుంటలు సేల్ డీడ్ ద్వారా విక్రయించారు. సంజీవరెడ్డి 0.08 గుంటల భూమిని తిరిగి తూనం రమేశ్ కు విక్రయించారని బాధితులు ఈసీలు చూపుతూ తమకు న్యాయం చేయాలని గుండాల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ నీలిమను వివరణ కోరగా.. తహసీల్దార్ జలకుమారి సెలవులో ఉన్నారని, ఫౌతి విషయం తనకు సోమవారం తెలిసిందని అన్నారు. ఉన్నతాధికారులను సంప్రదించి రెండు రోజుల్లో డాక్యుమెంట్ వివరాలు అందజేస్తామని, పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. కాగా, గుండాల రెవెన్యూ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారిందని, మారుమూల మండలంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. కొద్దిరోజుల కిందట ఇలాంటి ఘటనలోనే ఎన్ని ఎకరాల భూమి ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో తహసిల్దార్ జల కుమారి ని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆమె మరో అవినీతి వ్యవహారం తాజాగా బయటపడింది..

# ఎండిపోతున్న పంటలు.. రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మునగాల, మార్చి 5 : రిజర్వాయర్లలో నీళ్లు ఉన్నా.. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నీళ్లు ఇవ్వకుండా నట్టేట ముంచిందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇవాళ మునగాల మండల పరిధిలోని నేలమర్రి గ్రామంలో ఎండిపోతున్న పంట పొలాలను ఆయన రైతులతో పాటు కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో కాళేశ్వరం ద్వారా రైతులకు రెండు పంటలకు నీళ్లు ఇస్తుంటే కంది, పెసర, మిర్చి, పత్తి పండించే మెట్ట రైతులు భూములను అచ్చుకట్టుకొని వరి సాగు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోనికి వచ్చాక వారబందీ ద్వారా రైతులకు నీళ్లు ఇస్తానని చెప్పడంతో వారి మాటలు నమ్మిన రైతులు వరిసాగు చేస్తే నీళ్లు ఇవ్వకపోవడంతో పంటలన్నీ ఎండిపోయి అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో రైతులు కంటతడి పెడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనికరించే దుస్థితిలో లేదని మండిపడ్డారు. రైతాంగాన్ని, అన్ని వర్గాల ప్రజలను గాలికొదిలేసి అధికారంలోకి రావడానికి అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతిమయమైన కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డదారిన, దొడ్డి దారిన డబ్బులు ఎలా సంపాదించుకోవాలో అని ఆలోచిస్తుందే తప్ప రాష్ట్ర ప్రజలను పట్టించుకునే దుస్థితి లేదని ఆరోపించారు.ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ రెండు నియోజకవర్గాల ప్రజలు మా పిల్లలని చెప్పుకునే ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతులకు నీళ్లు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎండిపోతున్న పంటలకు నీళ్లు ఇవ్వకపోతే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వమని.. ఎక్కడికక్కడ అడ్డుకుంటామని అవసరమైతే జాతీయ రహదారి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తొగరు రమేష్, అజయ్ కుమార్, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రంగనాయక సాగర్ ప్రాజెక్టును సందర్శించిన హరీష్ రావు

సిద్దిపేట మార్చి 5, సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు మండలం చంద్లపూర్లోని రంగనాయక సాగర్ ప్రాజెక్టును మాజి మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సందర్శించారు.ఈ సందర్బంగా హరీష్ రావు మాట్లాడుతూ రంగనాయక సాగర్లోకి కాలేశ్వరం పంప్ హౌసుల ద్వారా నీటిని విడుదల చేసినందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు. సిద్దిపేట నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో పంట సాగు అవుతుంది. పంట చేతికొచ్చే సమయానికి నీళ్లు లేకపోతే రైతులు ఇబ్బంది పడతారని విజ్ఞప్తి చేయగా, అనంతసాగర్ నుండి 1 టిఎంసి నీళ్లను రంగనాయక



సాగర్కు పంపినందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు. నా కోరిక మేరకు ఒక్క టిఎంసి నీటిని ఉత్తమ్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తుడిచిపెట్టాలని చూస్తుంది.. ప్రజలకు నష్టం చేయకూడదు. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట, భూపాలపల్లి ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఎస్సారెస్పీ నీరు తగ్గినప్పటికీ, కాలేశ్వరం ద్వారా రెండు పంటలకు సాగునీరు విడుదల చేశాం. కాలేశ్వరంలో 15 రిజర్వాయర్లు బాగున్నాయి, 23 కిలోమీటర్ల టన్నెల్లు బాగున్నాయి, 19 సబ్ స్టేషన్లు బాగున్నాయి, 21 హౌసులు బాగున్నాయి, ప్రెజర్ మైన్లు బాగున్నాయి. మేడిగడ్డలో ఏడు బ్లాకులు ఉంటే, అందులో ఒక్క బ్లాక్లో ఒక్క పిల్లర్ మాత్రమే కుంగిపోయింది. కానీ గోరంతను కొండంత చేసి టిఆర్ఎస్పై బురదజల్లే ప్రయత్నం చేశారు. అధికారంలోకి వచ్చారు.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు అయింది. ఈ 15 నెలల్లో మేడిగడ్డలో పొంగిన పిల్లర్లను బాగు చేసే తీరిక ప్రభుత్వానికి లేదు. నేడు గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయి.. ఆ నీళ్లను లిఫ్ట్ చేసి లక్షల ఎకరాల పంటను కాపాడే అవకాశం ఉంది. కెసిఆర్ మీద కోపంతోనే, టిఆర్ఎస్ మీద కోపంతోనే, తెలంగాణ రైతులకు అన్యాయం చేయకూడదని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు.ఈ ప్రాంతంలో 500-1000 ఫీట్ల బోర్లు వేసినా నీళ్లు వచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఈరోజు రంగనాయక సాగర్ కింద, అనంతసాగర్ కింద, మల్లన్న సాగర్ కింద పండే పంట కాలేశ్వరం పంట కాదా? కళ్లు ఉండి కల్లు లేని కబోధుల్లా? చెవులు ఉండి చెవిటివాళ్లలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. పెండింగులో ఉన్న పంట కాలువల పనులు పూర్తి చేయాలని అన్నారు.కాళేశ్వరం కుంగింది అన్నవారికి, ఈ నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయి? రైతులతో పాటు మత్స్య సంపద కూడా పెరిగి, మత్స్యకారులకు ఆదాయం వస్తుంది. అన్ని వర్గాలకు మంచిచేసే ఇలాంటి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయకూడదు. కాళేశ్వరం తెలంగాణకి వరప్రదయిని. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కండ్లు తెరవండి.. లేదంటే చరిత్ర మిమ్ములను క్షమించదని అన్నారు.

# కార్పొరేషన్ చైర్మ న్ పదవి కావాలంటే పదేళ్లు కాంగ్రెస్ పార్టీలో పని చేసి ఉండాలి

### పార్టీ అంతర్గత విషయాలు మీటింగ్‌లోనే చెప్పాలి

### గాంధీభవన్ బయట మాట్లాడొద్దు

### అసంతృప్తులకు మీనాక్షి నటరాజన్ అల్టిమేటం

హైదరాబాద్ మార్చి 5,ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ స్థితిగతులు, ఫలితాలపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ సమీక్షించారు. పార్టీ పరిస్థితిపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. కార్పొరేషన్ చైర్మ న్ పదవి కావాలంటే పదేళ్లు కాంగ్రెస్ పార్టీలో పని చేసి ఉండాలని, కార్యకర్తలను ఎలా వాడుకోవా లో తెలుసని, పార్టీ విజయం కోసం కష్టపడిన అం దరికీ న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన కొత్త వారిని కలుపుకు పోతామన్నారు. పార్టీ అంతర్గత విషయాలు మీటింగ్‌లోనే చెప్పాలని గాంధీభవన్ బయట మాట్లాడొద్దని ఆమె సూచించారు. అలాగే మంత్రులు తప్పొప్పులు కూడా మీటింగ్‌లోనే చె ప్పాలని అంతేకానీ ప్రత్యేక సమావేశాలు పెట్టడం సోషల్ మీడియాలో పెట్టడం వంటివి చేసి పార్టీ, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయొద్దన్నారు.పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఇకపై ఎవరైనా గొడవ పడినా, పార్టీపై బహిరంగంగా కామెంట్స్ చేసినా ఊరుకునే ప్రసక్తే లేదని నేతలకు ఆమె వార్నింగ్ ఇచ్చారు. ఇన్ చార్జీల వల్లే సమస్యలు వస్తే పదవి నుంచి తొలగిస్తామని ఆమె హెచ్చరించారు. నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లు బాధ్యతాయుతంగా వ్యవహారించి



అందరినీ కలుపుకుపోవాలన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే లు ఎల్లవేళలా ప్రజలకు అందు బాటులో ఉండాలని ఆమె సూచించారు. పటాన్‌చెరులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తమను ఇబ్బంది పెడుతున్నారని కాట శ్రీనివాస్ గౌడ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కోసం కమిటీ వేసినా ఇప్పటివరకు రిపోర్టు ఇవ్వలేదంటూ ఆయన మీనాక్షి నటరాజన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలంటూ మీనాక్షి నటరాజన్‌కు కాట శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ నేతలే అధికారం చెలాయిస్తున్నారు: మీనాక్షి ఎదుట నాయకుల ఆవేదన

అధికారులు తమ మాట వినడం లేదని మరికొందరు నేతలు ఎమ్మెల్యే మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. ఇంకా బీఆర్ఎస్ నేతలే అధికారం చెలాయిస్తున్నారని నాయకులు ఆమె ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇందిరమ్మ ఇళ్లు అయినా తాము చెప్పిన వారికి ఇస్తే గౌరవం ఉంటుందని మీనాక్షి నటరాజన్‌కు పలువురు నేతలు విజ్ఞప్తి చేశారు.ఈ సమీక్షలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల ప్రజాపాలనలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మీనాక్షి నటరాజన్ చర్చించారు. చారిత్రాత్మక నిర్ణయాలైన కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపైనా ఆమె అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందని ఆమె ఆరా తీశారు. సంస్థాగతంగా పార్టీ నిర్మాణం, కమిటీల ఏర్పాటుపైనా కీలకంగా ఆమె చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు మీనాక్షి దిశానిర్దేశం చేశారు. పార్టీలో పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లోపించకుండా ఐక్యంగా ముందుగు సాగాలని ఆమె హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె సూచించారు. ఈ సమీక్షలో ఏఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిసిసి అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాలు చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యం వల్లే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం : తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ, మార్చి 5 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు ప్రారంభించింది. నిపుణుల చేత పరీక్షించకుండా పనులు ప్రారంభించడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు.ఇవాళ మిర్యాలగూడ సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. టన్నెల్ పనులు ప్రారంభించేటప్పుడు నిపుణులు అయినటువంటి ఇంజనీర్ల చేత టన్నెల్‌ను పూర్తిగా పరిశీలించి పనులు ప్రారంభించాల్సి ఉందని.. కానీ ఇవేవీ పట్టించుకోకుండా పనులు ప్రారంభించడం వలన ఈ రోజు ఎనిమిది మంది ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం



చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలం పుంజుకోవడం వలన తెలంగాణ రాష్ట్రంలో ముమ్ముందు మత ఘర్షణలు తలెత్తే ప్రమాదం ఉన్నదని తెలిపారు.ఇకనైనా ప్రధాన పార్టీలు కళ్ళు తెరవకుంటే తెలంగాణ రాష్ట్రంలో పెను ప్రమాదం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి , పోతినేని సుదర్శన్ , నాగేశ్వర్ , తుమ్మల వీరారెడ్డి , సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం కరపత్రం విడుదల

నిర్మల్ మార్చి 5, మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఖానాపూర్ మండలంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకులు భాను బేగం అదిలాబాద్ జిల్లా నాయకురాలు రమ్య కళ ఆధ్వర్యంలో 115 వ కరపత్రం ను ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ . సుదాకార్ ,కార్యదర్శి కర్నాటి మల్లేష్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా సుదాకార్ మాట్లాడుతూ శ్రామిక మహిళల పోరాటానికి చిహ్నం. అంతర్జాతీయ మహిళా దినోత్సవ మన్నారు.వందల ఏళ్ల కిందటే పని గంటలను తగ్గించాలని తాము అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులను తామే మార్చుకోవడం కోసం మహిళలు వీధుల్లోకి వచ్చి కదం తొక్కిన రోజుకు గుర్తుగా మహిళా దినత్సోవం రూపొందించిందన్నారు. ఆ పోరాటాల స్ఫూర్తిని మరోసారి గుర్తు చేసుకుంటూ దేదీప్యమానమైన భవిష్యత్తు కోసం మహిళా సమాజం అడుగులు వేయడం కోసం సూర్తినికి పొందే రోజుగా దీన్ని నిర్వహించుకోవాల్సి ఉంటుంది. అయితే నేడు దురదృష్టవశాత్తు మహిళా దినోత్సవం అందించిన స్ఫూర్తి క్రమంగా కనుమరుగవుతున్నది. ఏ లక్ష్యం కోసం పోరు జరిగిందో, దేని కోసం పోరాటం జరగాలో అనే అంశాల కనీస ప్రస్తావన లేకుండా మహిళా దినోత్సవాల నిర్వహణ ఒక తంతుగా మారుతున్న పరిస్థితులు మార్చేసి మహిళలకు అందవలసిన స్ఫూర్తిని, వారికి చూపించాల్సిన నవయుగాన్ని కనుమరుగు చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సోషలిస్టు సమాజం వ్యవస్థాపకుడు కామ్రేడ్ లెనిన్ మహాశయుడు మహిళల సాధికారత గురించి చేసిన వ్యాఖ్యలను ఒక సారి గుర్తు చేసుకోవలసి ఉన్నది. మహిళా సమాజంలో నూతన వెలుగులు నిండాంటే స్త్రీలను వంటిల్లు అనే జీవరహిత వాతావరణం నుంచి బయటకు తెచ్చి సామాజిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం, రాజకీయాల్లోకి తీసుకుని రావడం చాలా ముఖ్యమన్న ఆలోచనలు విప్లవాత్మకమైనవి. "వంట గదికి పరిమితంగా చూడబడుతున్న మహిళలను అక్కడి నుంచి విముక్తం చేయకపోతే వారికి నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, సమానత్వాలు సాధ్యం కావనేది లెనిన్ ప్రతిపాదన. ప్రతి వంటకత్తె ఒక రాజకీయ వేత్త కావాలి అనే లోతైన అంశాలతో లెనిన్ అనేక ప్రసంగాలు, వ్యాసాలు కూడా రాశారు. ఇక్కడ మహిళలు రాజకీయ వేత్త కావాలి అంటే కేవలం పదవులు పొందడం కాదు, పదవుల కోసం ఉద్యమాలు నిర్వహించడమూ కాదు. 'సరైన రాజకీయ, ఆర్థిక, తాత్విక తుర్పుధాలును అలువల్చు కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఖానాపూర్ మండల అధ్యక్షులు పసుపుల మీన అమ్ముల కవిత ,ఎర్రన్న శిరీష ,పసుపుల మీనా,అరుణ ,అందుర్తి నర్సు తదితరులు పాల్గొన్నారు.


# నాటిన ప్రతీ మొక్కను రక్షించాలి : కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్



నూతనకల్, మార్చి 5 : నర్సరీతోపాటు పల్లె ప్రకృతి వనాల్లో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్ అధికారులకు సూచించారు. ఇవాళ మండల కేంద్రంలోని వన నర్సరీ, పల్లె ప్రకృతి ఉపాధి హామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ వేసవిలో నీటి ఎద్దడి నుండి మొక్కలని కాపాడాలని అన్నారు. ఉపాధి హామీ పని కోరిన ప్రతీ ఒక్కరికి పని కల్పించే బాధ్యత ఉపాధి సిబ్బందికి ఉందన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మండల కేంద్రంలోని వాహనాలు నడవని ప్రదేశంలో జరుగుతున్న ఉపాధి పనులను మోటార్ సైకిల్‌పై వెళ్లి పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్వరలో జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలలో బాగా రాసి.. జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులు లక్ష్యసాధనతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆయన అన్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు ఎంపీడీవో సునీత, ఎంఈఓ రాములు నాయక్ తదితరులున్నారు.

# రేవంత్ రెడ్డి సీఎం కుర్చీకి పునాది వేసిందే నేనే.. తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కుర్చీకి పునాది వేసింది తానే అని మల్లన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఇందుకు కారణం రేవంత్ రెడ్డినే అని ఆరోపించారు. రేవంత్ విధానాల వల్ల ప్రజలు విసిగిపోతున్నారని మల్లన్న పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి పరోక్షంగా



బీజేపీ పార్టీకి సపోర్ట్ చేస్తూ కాంగ్రెస్ పార్టీని ఖతం చేస్తున్నాడు. రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటు, రేవంత్ రెడ్డి సిట్టింగ్ మల్కాజ్‌గిరి రెండు సీట్లల్లో కావాలని కాంగ్రెస్ పార్టీని ఓడించాడు. ఒక వేళ రేవంత్ రెడ్డి బలంగా ప్రచారం చేసి ఉంటే.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాకపోయేది అని పేర్కొన్నారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఎందుకొచ్చిందో రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.ఇటీవల జరిగిన టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఓటమికి రేవంత్ రెడ్డినే కారణమని ఎమ్మెల్సీ మల్లన్న ఆరోపించారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిందన్నారు. ఒక పని చేస్తే తరతరాలు మన పేరు గుర్తుండాలి.. రేవంత్ రెడ్డి పని చేస్తే తోటి మంత్రులే ఆయన పేరు మర్చిపోతున్నారు అని తీన్మార్ మల్లన్న విమర్శించారు. రేవంత్ రెడ్డి విలన్ కాబట్టే విలన్ అని అంటున్నారు అని మల్లన్న చెప్పారు. నువ్వు చేసిన కులగణన సర్వే తప్పు అని నేను నిరూపిస్తా, చర్చకు సిద్ధమా..? అని రేవంత్ రెడ్డికి తీన్మార్ మల్లన్న సవాల్ విసిరారు.

# ఉమామహేశ్వర స్వామి సన్నిధిలో జాయింట్ కలెక్టర్ దంపతులు



యాగంటి(విజయ సారథి): నంద్యాల జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.విష్ణు చరణ్ దంపతులు బుధవారం యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం జరిగినది. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది. అనంతరం తీర్ధ ప్రసాదాలు అందజేయడం జరిగినది. కార్యక్రమములో తహసీల్దార్ బి.నారాయణ రెడ్డి, కార్యనిర్వహణాధికారి బి.చంద్రుడు, యాగంటిపల్లె మౌళీశ్వర రెడ్డి, రెవిన్యూ సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొనడం జరిగినది.

# మిగులు జలాలపై కేంద్రానికి లేఖ రాయండి

## చంద్రబాబుకు హరీష్ రావు సవాల్

సిద్దిపేట,మార్చి5: మిగులు జలాలే వాడుకుంటున్నామని అంటున్న చంద్రబాబు..దమ్ముంటే తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరం లేదని చెప్పాలని ఎపి సీఎం చంద్రబాబుకు మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. 'మీకు నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే సమ్మక్క సారక్క, సీతమ్మ సాగర్, వార్దా ప్రాజెక్టు, కాళేశ్వరంలో మూడో ప్రాజెక్టుకి అనుమతులు ఇవ్వమని కేంద్రానికి చెప్పండి. లేఖ రాయండని సవాల్ చేశారు. అప్పుడు మేము మీకు నిజంగా తెలంగాణపై ప్రేమ ఉందని నమ్ముతాం. మీ రెండు కళ్ళ సిద్దాంతం కరెక్ట్ అని చెబుతాం. కేంద్ర బడ్జెట్ లో మీ వాటా మీరు తీసుకున్నారు.. మరి తెలంగాణకి ఎందుకు ఇవ్వలేదని ఎందుకు ప్రశ్నించలేదు. మీకు తెలంగాణపై ప్రేమ లేదు.. మా హక్కుల కోసం ఏనాడు పోరాడలేదు. గోదావరిలో తెలంగాణకి 969 టీఎంసీల నీటిని కేటాయించారు. అవి మమ్మల్ని వాడుకొనివ్వండి.' అని హరీష్ రావు వ్యాఖ్యానించారు. మీరు మాట్లాడుతున్నదానికి మీ చేతలకు సంబంధం లేదని సీఎం చంద్రబాబును హరీష్ రావు విమర్శించారు. వైజాగ్ ఉక్కు పరిశ్రమలాగా మా ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని కాపాడాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చినట్టు పాలమూరు ప్రాజెక్టుకి జాతీయ హోదా అడగాలన్నారు. ఇక్కడ ఉన్న ఎంపీలు పార్లమెంట్లో మౌనం వహిస్తున్నారని.. ఇంత జరుగుతున్న సీఎం రేవంత్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని విమర్శలు గుప్పించారు. 8మంది ఎంపిలున్న బిజెపి మాట్లాడదు..కాంగ్రెస్ ఎంపిలు నిలదీయడం లేదని మండిపడ్డారు.

# జగన్ మాటలు ఆశ్చర్యంగా ఉన్నాయి... టీడీపీ ఎంపీ విసుర్లు

ఢిల్లీ: అసెంబ్లీకి రాకుండా మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదంగా ఉందని తెలుగుదేశం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. జగన్ ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్నారా.. ప్రజల కోసం పోరాటం చేస్తున్నారా.. అనేది ప్రజలకు తెలుసునని చెప్పారు. ఢిల్లీ వేదికగా ఎంపీ అప్పలనాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అమలు చేసిన రాజారెడ్డి రాజ్యాంగాన్ని ఇప్పుడు అమలు చేయడం కుదరదని చెప్పారు. జగన్ మాట్లాడుతున్న తీరు చూస్తుంటే, ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యం, చట్టం, ధర్మం గురించి జగన్ మాట్లాడుతుంటే ఆశ్చర్యం కలుగుతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శలు చేశారు.అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా జగన్ మాట్లాడుతున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. చంద్రబాబు పాలనను ప్రజలు శభాష్ అంటున్నారన్నారు. అసెంబ్లీకి రాకుండా ప్రైవేట్గా మాట్లాడుతున్న జగన్ వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శలు చేశారు. జగన్ ఆయన టీం వ్యవస్థను మొత్తం నాశనం చేశారని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్డీయే కూటమి సహాయ సహకారాలతో సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర పరిస్థితిని గాడిన పెడుతున్నారని తెలిపారు. జగన్ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# అమరవాతిపై మట్లాడే అర్హత లేదు

## వైకాపా ఎమ్మెల్సీకి మంత్రుల ఘాటు సమాధానం

అమరావతి,మార్చి5 ఏపీ రాజధాని అమరావతి అంశంపై వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఏపీ మంత్రులు తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, పార్థసారధి వైసీపీ నేతలపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానిస్తూ.. రాజధాని గురించి మాట్లాడే అర్హత వైసీపీ సభ్యులకు లేదని, ప్రజలు ఎన్నికల్లో అమరావతే ఏకైక రాజధాని అని తీర్పు ఇచ్చారని అన్నారు. మూడు రాజధానుల ప్రకటన తర్వాత ప్రజలు వైసీపీకి ఏ విధంగా తిరస్కార తీర్పు ఇచ్చారో మనందరికీ తెలుసునని.. చంద్రబాబు అద్భుతంగా అమరావతి రాజధానిని నిర్మిస్తారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి విజన్ ఏమిటో మేము చేసి చూపిస్తాం అంటూ ఆయన అన్నారు. అలాగే, ఈ విషయమై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. మూడురాజధానుల ప్రకటనతో ఎన్నికలకు వెళ్లిన వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, ప్రజలు ఇచ్చిన తీర్పుతో వైసీపీ నేతలు తమ రాజధాని నిర్ణయం తప్పని గ్రహించారని అన్నారు. బొత్స సత్యనారాయణ కూడా మా నిర్ణయం తప్పని, ప్రజలు అంగీకరించలేదని ఒప్పుకున్నారు. ఈ విషయంపై వీడియోను అవసరమైతే సభలో ప్రదర్శిస్తామని వ్యాఖ్యానించారు. మరోవైపు మంత్రి పార్థసారధి కూడా వైసీపీ నేతలపై ఘాటుగా స్పందించారు. అమరావతిపై వైసీపీ నేతలు విషం చిమ్మారని, ఇప్పటికైనా వైసీపీ నేతలు తమ తీరు మార్చుకోవాలని ఆయన అన్నారు. మీరు మనుషుల మధ్య నుంచే అమరావతికి వస్తున్నారనే విషయం తెలుసుకోవాలని ఆయన అన్నారు. గత ప్రభుత్వం అమరావతిలో అధికారులు ఉండేందుకు కూడా సరైన వసతులు ఏర్పాటు చేయలేదని.. హైదరాబాద్ శివారు ప్రాంతాలాగే విజయవాడ, గుంటూరు కలసిపోతున్నాయని ఆయన అన్నారు. అదే విధంగా అమరావతి నగరం కూడా విస్తరిస్తుందని, అమరావతిని గొప్ప నగరంగా మేము కడతామని అన్నారు. అయితే ఈ విషయంపై మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ భిన్నంగా స్పందించారు. రాజధాని అమరావతి పై మా నిర్ణయం తప్పని మేము ఎక్కడా చెప్పలేదని, ఆ రోజు మా విధానం అది.. ఆ విధానం ప్రకారం ముందుకు వెళ్లామని తెలిపారు. రాజధానిపై రాబోయే కాలంలో ఏం జరగబోతోందనేది కాలమే చెబుతుందని ఆయన అన్నారు. మొత్తానికి అమరావతి రాజధాని అంశంపై రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# సమన్వయంతో మహిళా దినోత్సవ వేడుకలు ను విజయవంతం చేద్దాం..

## మహిళా భద్రత, సాధికారతను ప్రతిబింబించేలా స్టాళ్ల ఏర్పాటు

## డీఆర్డీఏ, మెప్మా తదితర విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

## ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో వేడుకల నిర్వహణ

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,మార్చి5(ఆర్ఎన్ఎ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా భద్రత, సాధికారతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయని.. వివిధ పథకాలు, కార్యక్రమాల ఫలాలను స్త్రీ శక్తికి చేరువచేసి, వారిని సమగ్రాభివృద్ధి దిశగా నడిపించేలా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దామని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో వేడుకల నిర్వహణకు సంబంధించి దిశానిర్దేశర చేసేందుకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి



బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేడుకల నిర్వహణకు సూచనలు చేశారు. ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా వివిధ శాఖల సమష్టి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్డీఏ, మెప్మా, వైద్య ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, శాఖల వారీగా కార్యాచరణను వివరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయం మొదలు, రాష్ట్ర స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని.. ఎన్టీఆర్ జిల్లాస్థాయి కార్యక్రమం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. వివిధ శాఖల పరిధిలో మహిళాభివృద్ధికి అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై మహిళలను జాగృతం చేసి.. వాటిని సద్వినియోగం చేసుకునేలా ముందుకు నడిపించేందుకు స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్డీఏ, మెప్మా తదితర విభాగాలు ఇందుకు ప్రణాళికాయుతంగా వ్యవహరించాలన్నారు. బ్యాంకు లింకేజీ మద్దతు, ప్రకృతి సేద్యం ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, మిల్లెట్స్ విలువ జోడింపు, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చేయూతనిచ్చే పథకాలు, కార్యక్రమాలు, పోషణ భద్రత, పీఎం విశ్వకర్మ, పీఎంఈజీపీ వంటి పథకాలు, లఖ్పతిదీదీ, డ్రోన్ దీదీ తదితరాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. మహిళల భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటివాటిపైనా దృష్టిసారించాలని.. ప్రత్యేక అవగాహన ర్యాలీల నిర్వహణకూ ఏర్పాటు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పీవో-యూసీడీ వెంకటరత్నం, డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని, డా. ఎన్టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త డా. జె.సుమన్, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఏసీపీ కె.లతాకుమారి, ఎల్డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# వంశీ కేసు.. కోర్టులో పోలీసుల పిటిషన్

విజయవాడ, మార్చి 5: గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్పై బెదిరింపు కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని (మరో పదిరోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో ( పోలీసులు ఈరోజు ( పిటిషన్ దాఖలు చేశారు. గతం వారం మూడు రోజుల కస్టడీలో వంశీ సహకరించలేదని పోలీసులు తెలిపారు. చాలా ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేదని, ఆధారాలతో అడిగినా స్పందించలేదని పిటీషన్లో పేర్కొన్నారు. మరో పది రోజుల పాటు వంశీని కస్టడీకి ఇస్తే...ఈ కేసుకు సంబంధించి కీలకమైన సమాచారం రాబట్టే అవకాశం ఉందని కోర్టుకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.గతంలో కూడా పది రోజుల పాటు వంశీని కస్డడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా.. న్యాయాధికారి కేవలం మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతిచ్చారు. అయితే మూడు రోజుల కస్టడీలో కూడా పోలీసులకు వంశీ సహకరించని పరిస్థితి. ఏ ప్రశ్న వేసినా తెలీదు, మరిచిపోయాను అంటూ సమాధానాలు దాటవేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో అప్పట్లోనే మరోసారి వంశీని కస్టడీ కోరతామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే నేడు ఎస్సీ, ఎస్టీ కోర్టులో వంశీని కస్టడీకి కోరుతూ పిటిషన్ వేసిన పోలీసులు.. అందుకు కారణాలను కూడా న్యాయస్థానానికి తెలియజేశారు. ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజ్లు, ఇతర ముద్దాయిలను చూపించి పదే పదే ప్రశ్నించినప్పటికీ వంశీ నుంచి సరైన సమాచారం రాలేదని కోర్టుకు తెలిపారు.

# 492 కేజీల గంజాయి 8 మంది ముద్దాయిలు అరెస్ట్.....

## రెండు లక్షలు 78000 నగదు ఒక మహేంద్ర కారు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం......



కాకినాడ (విజయ సారథి) కాకినాడ జిల్లాజగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో8 మంది అరెస్టు చేసి భారీ ఎత్తున 492 కేజీల గంజాయి, రెండు లక్షల 78 వేల రూపాయలు నగదు,రెండు వాహనాలు స్వాధీనం తీసుకున్నామని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాదవ్ తెలిపారు. బుధవారం జగ్గంపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో492 కేజిల గంజాయితో పాటు కాకినాడ జిల్లా ఒకరు, అల్లూరి సీతారామరాజు జిల్లా ముగ్గురు, వ్యక్తులు తమిళనాడు రాష్ట్రం నుండి ఇద్దరూ, మరియు కర్ణాటక రాష్ట్రం నుండి ఇద్దరు చెందిన మొత్తం 8 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. వీరితోపాటు ఒక మహేంద్ర కారు, ఒక మోటార్ సైకిల్, 2,78,000 నగదు మరియు ఏడు సెల్ ఫోన్ లు మొత్తం 30,52,000/- విలువ గల గంజాయి స్వాదీనం చేసుకున్నారు .ఏజెన్సీ ప్రాంతం నుండి జగ్గంపేట మండలం జగనన్న కాలనీ కు మరియు జగ్గంపేట నుండి తమిళనాడు, కర్ణాటక రాష్టలకు గంజాయి తరలిస్తుండగా కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ కి వచ్చిన సమాచారం మేరకు జగ్గంపేట జగనన్న కాలనీ లో ఒక ఇంటిలో స్వాదినం చేసుకున్న పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ వారు నేషనల్ హైవే మీద గంజాయి రవాణా మీద ప్రత్యేక నిఘా పెట్టడం జరిగింది. దానిలో భాగంగా నిన్నటి రోజు మంగళవారం జగ్గంపేట పోలీస్ లకు సమాచారం ఇచ్చి రైడ్ చేయమని ఆదేశాలు జారీ చేసినందునజగ్గంపేట మండలం జగన్నన్న కాలనీ లో రైడ్ చేసి ఒక మహీంద్రా కారు నంబర్ ఎపి31డిడి4032 లో 7 బస్తాలు గంజాయి, ఇంటిలో 10 బస్తాలు గంజాయి, క్యాష్ 2,78,000, ఏడు సెల్ ఫోన్ లు, ఒక హీరో హోండా మోటార్ సైకిల్ ఏపీ39ఇజి7230 స్వాదీనము చేసుకొని 8 ముద్దాయిలను అరెస్ట్ చేయడము జరిగిందన్నారు. ఈ కేసు లో ఏ వన్ ఏజెన్సీ ప్రాంత సప్లయర్స్ కు మరియు ఇతర రాష్ట్రాల కనుగోలు దారులకు మధ్య వర్తిగా/ డిస్ట్రిబ్యూటర్ గా వ్యవహరిస్తున్నాడు. ఈ కేసు లో మరో ఇద్దరు తమిళనాడు కు చెందిన మురుగన్ ,కర్ణాటక కు చెందిన సర్వన్ అనే వ్యక్తుల ను అరెస్ట్ చేయవలసి ఉన్నది. ఏ వన్ కు రెండు మరియు ఎ టు కి ఒక పాత కేసులు కలవు. ఈ కేసు ను పట్టుకోవడం లో చురుకుగా వ్యవహరించిన జగ్గంపేట సిఐ వై ఆర్ కె శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై రఘునందన్ రావు, గండేపల్లి ఎస్సై శివ నాగ బాబు, కిర్లంపూడి ఎస్సై జి. సతీష్ మరియుహెచ్ సి (గండేపల్లి), పిసికృపారావు(గండేపల్లి)కానిస్టేబుల్-బాలాజీ(గండేపల్లి)కానిస్టేబుల్-సత్యనారాయణ (జగ్గంపేట), హోం గార్డ్ లు అనీల్, వీరబాబు, సోమరాజు, సూరిబాబు లను ఉన్నత అధికారులు అభినందించారు. పెద్దాపురం డి ఎస్ పి శ్రీహరి రాజు ఆధ్వర్యంలో జగ్గంపేట సి ఐ వై ఆర్ కె శ్రీనివాస్ కేసు ను దర్యాప్తు చేస్తున్నారు. మరియు ఈ కేసు లో ఫైనాన్సర్ ఇన్వెస్టిగేషన్ కూడా చేయడం జరుగుతుందన్నారు. ముద్దాయిలు గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి స్వాదీనము చేసుకోవడం జరుగుతుంది. ఎవరైనా సరే ఇళ్లను అక్రమ ఆసాంఘిక కార్య క్రమాలకు అద్దెకు ఇచ్చినచో వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# రెండుసార్లు ఫెయిల్..అయినా ప్రధానిగా ఛాన్స్

## రాజీవ్ గాంధీపై మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,మార్చి5: కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి తన వివాదస్పద వ్యాఖ్యలతో పార్టీని ఇరుకున పెట్టారు. దివంగత ప్రధాని రాజీవ్ గాంధీని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన రెండు సార్లు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని.. అలాంటి వ్యక్తి దేశ ప్రధాని ఎలా అయ్యారోనంటూ వ్యాఖ్యానించారు. ప్రముఖ మీడియా సంస్థకి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'నేను, రాజీవ్ గాంధీ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో కలిసి చదువుకున్నాం. నాడు ఆయన పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. విశ్వవిద్యాలయం విద్యార్థులను ఉత్తీర్ణులు చేయాలనే ప్రయత్నిస్తుంది. కానీ, రాజీవ్ మాత్రం విఫలమయ్యారు. ఆ తర్వాత లండన్లోని ఇంపీరియల్ కాలేజీలో కూడా ఫెయిల్ అయ్యారు. చదువు విషయంలో ఆయన చాలా కష్టపడ్డారు. అయినప్పటికీ ఉత్తీర్ణత సాధించలేకపోయారు. రెండు సార్లు విఫలమై, పైలట్గా పని చేసిన వ్యక్తి దేశ ప్రధాని అవుతారని నేను ఊహించలేదు. ఇది ఎలా సాధ్యమైందో' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియోను భాజపా నేత అమిత్ మాలవీయా 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు. 'ఆయనను ముసుగు తొలగించనివ్వండి' అంటూ విమర్శించారు. ఈ వీడియో నెట్టింట వైరల్గా మారింది. మణి శంకర్ గతంలోనూ సొంత పార్టీపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాజకీయాల్లో తన ఎదుగుదలకు, పతనానికి 'గాంధీ కుటుంబమే' కారణమన్నారు. పదేళ్లలో పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీతో ఒక్కసారి కూడా సమావేశం అయ్యేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో కూడా ఒకటి, రెండు సార్లు మాత్రమే భేటీ అయినట్లు తెలిపారు. కాంగ్రెస్లో చిన్న నేతలకు సరైన గుర్తింపు ఉండదన్నారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com